




# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక








హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 156, ఎడిటర్,భీముడు నాయక్ పేజిలు : 12, వెల రూ. 1, గురువారం - 11- జూలై - 2024

PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


### 41 ఏళ్ల క్రితం ఇందిరాగాంధీ..
## మళ్లీ ఇప్పుడు మోదీ!



ఢిల్లీ: రష్యా పర్యటన ముగించుకున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ మాస్కో నుంచి మంగళవారం రాత్రి ఆస్ట్రియా రాజధాని వియన్నా చేరుకున్నారు. తద్వారా 1983లో ఇందిరా గాంధీ పర్యటించిన 41 ఏళ్ల తర్వాత ఆస్ట్రియాలో పర్యటించిన రెండో ప్రధానిగా నిలిచారు. ఎయిర్ పోర్టులో ఆయనకు ఆస్ట్రియా విదేశాంగ మంత్రి అలెగ్జాండర్ స్కాలెన్ బర్గ్ తోపాటు ఆస్ట్రియాలో భారత రాయబారి శంభు కుమరన్

మిగతా..2లో

### బద్రీనాథ్ హైవే పై విరిగి పడిన భారీ కొండచరియలు..
## ప్రాణాల కోసం ప్రజలు పరుగులు..



ఢిల్లీ : ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. రాష్ట్రంలోని చమోలీలో బద్రీనాథ్ జాతీయ రహదారిపై (బుధవారం) ఈ రోజు భారీ కొండచరియలు విరిగి పడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనకు సంబంధించిన ఒక వీడియో సోషల్ మీడియా లో చక్కర్లు కొడుతోంది. 30 సెకన్ల నిడివి గల

### భారత్-చైనా సరిహద్దుల్లో
## 108 కిలోల బంగారం పట్టివేత..!




ఢిల్లీ: భారత్-చైనా సరిహద్దుల్లో ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసులు పెద్ద ఎత్తున బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. చొర బాటుదారుల నుంచి 108 కిలోల బంగారు కడ్డీలను పట్టుకున్నది. అయితే, సరిహద్దుల్లో ఇంత పెద్ద మొత్తంలో బంగారాన్ని పట్టుకోవడం ఐటీబీపీ చరిత్రలో ఇదే తొలిసారి. లడఖ్ సెక్టార్‌లో ఇద్దరు అనుమానితుల వ్యక్తుల నుంచి అక్రమంగా

మిగతా..2లో

### ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో గంజాయి కలకలంపై మంత్రి లోకేశ్ ఆగ్రహం



- మంత్రి నారా లోకేశ్ ను కలిసిన విద్యార్థుల తల్లిదండ్రులు
- ట్రిపుల్ ఐటీ క్యాంపస్ మొత్తం గంజాయికి అడ్డాగా మారిందని ఆవేదన
- తమ పిల్లలను చేర్చి నష్టపోయామని వ్యాఖ్యలు
- ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో గంజాయి కలకలంపై విచారణ జరపాలని లోకేశ్ ఆదేశం

అమరావతి: కడప జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో గంజాయి కలకలం రేగింది. దీనిపై విద్యాశాఖ మంత్రి

### మార్పు రావాలి... కాంగ్రెస్ రావాలి అంటే...
## మొత్తానికి పెద్ద మార్పే వచ్చింది



- నాడు కాంగ్రెస్ పాలనలో హాస్టళ్లలో పురుగుల అన్నం.. నీళ్ల చారు..
- ఇప్పుడు బల్లిపడిన టిఫిన్లు, చిట్టెలుక పడిన చట్నీలని మండిపాటు
- విషాహారం తింటే... విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఎవరు? అని ప్రశ్న
- ప్రభుత్వభూములను ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలకు తనఖాపెడతారని సమాచారం ఉందన్న కేటీఆర్
- రూ.10 వేల కోట్ల సమీకరణకు రూ.100 కోట్ల కమీషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైందంటూ ఆరోపణలు

సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ హాస్టల్‌లో చట్నీలో చిట్టెలుక దర్శనంతో ఇక్కడి విద్యార్థులు బెంబేలెత్తారన్నారు. ఈ విషాహారం తింటే.. విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఎవరు?? అల్లారుముద్దుగా పెంచుకున్న తల్లిదండ్రులకు భరోసా ఎక్కడ.. అని ప్రశ్నించారు. కలుషిత ఆహారం వల్ల... పిల్లలు ఆడుకోవాల్సిన వయస్సులో ఆసుపత్రుల పాలవు తున్నారని ఆగ్రహం వ్యక్తం

హైదరాబాద్ : మార్పు రావాలి... కాంగ్రెస్ రావాలంటూ పలికి మొత్తానికి కాంగ్రెస్ వాళ్లు వచ్చారని... అలాగే వారు చెప్పినట్లుగా పెద్ద మార్పే తెచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'జేఎన్టీయూ మెస్ చట్నీలో చిట్టెలుక' అనే వార్తా క్లిప్పింగ్‌ను ఆయన జోడిస్తూ... కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఆనాటి కాంగ్రెస్ పాలనలో.. ప్రభుత్వ

### కరెంట్ కోతలు విద్యుత్ నిర్వహణ లోపానికి నిదర్శనం: హరీశ్ రావు



2లో

ఆనంద్ నగర్, మాసాబ్ ట్యాంక్‌లో రాత్రి నుంచి ఉదయం వరకు కరెంట్ లేదని వెల్లడి

ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడితే పట్టించుకునేవారే కరవయ్యారన్న హరీశ్ రావు

ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి కరెంట్ కోతలను అరికట్టండని సూచన

హైదరాబాద్ : రాజధాని నగరం హైదరాబాద్‌లో కరెంట్ కోతలు విద్యుత్ నిర్వహణ లోపానికి నిదర్శనమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు

## పవన్ కల్యాణ్ వార్నింగ్, ఎర్రచందనం తరలించిన కొందరు నాయకులు హడల్...



వివరాలు 2లో..

- ఎర్రచందనం స్మగ్లర్లకు, అధికారులకు తడిచిపోయింది, లెక్కలు
- ఇంతకాలం మాట వినని అటవి శాఖ అధికారులు, సిబ్బంది, పోలీసులకు రాజమండ్రి, శ్రీకాకుళం, విశాఖపట్టణంకు బదిలీ
- వేలాది రూపాయలు కూలీలు ఇచ్చి శేషాచలం అడవుల్లో ఎర్రచందనం చెట్లు కొట్టించారు
- ఎర్రచందనం స్మగ్లర్లకు, అధికారులకు తడిచిపోయింది, లెక్కలు
- ఇంతకాలం మాట వినని అటవి శాఖ అధికారులు, సిబ్బంది, పోలీసులకు రాజమండ్రి, శ్రీకాకుళం, విశాఖపట్టణంకు బదిలీ .

అమరావతి: ఆంధ్రప్రదేశ్ లో గత కొన్ని సంవత్సరాల నుంచి ఎర్ర చందనం దర్జాగా తరలించేశారని ఆరోపణలు ఉన్నాయి. అటవి శాఖలోని పెద్ద తలకాయల అండదండలతో వైసీపీ నాయకులు

### స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగుతుందా? కేంద్రమంత్రి పర్యటన ఉద్దేశం ఏంటి..?



2లో

అమరావతి: మూడు సంవత్సరాలకు పైగా పోరాటం చేస్తున్న కార్మికులతో పాటు.. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నినదించిన ఆంధ్రప్రదేశ్ అభిమానులందరికీ సంతోషం కలిగించే వార్త రాబోతోందా? విశాఖ స్టీల్ ప్లాంట్?ని ప్రైవేట్ పెట్టుబడుల నుంచి కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించబోతుందా? కేంద్ర ఉక్కు మంత్రి హెచ్ డి కుమారస్వామి ,విశాఖ పర్యటన అందుకోసమేనా? పూర్తిస్థాయి ఉత్పత్తికి అవసరమైన వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వడంతో పాటు రాష్ట్ర భారతీయ జనతా పార్టీ చేసిన సెయిల్?లో విలీనం ప్రతిపాదన చర్చకు రాబోతోందా? ఒక పర్యటన 100 సమాధానాల కోసం ఎదురుచూస్తోంది. నేడు విశాఖకు కేంద్ర స్టీల్ మినిస్టర్ హెచ్ డీ కుమారస్వామి రాబో తున్నారు. స్టీల్ ప్లాంట్?లోనే బస చేయబోతున్నారు. రేపు ఉన్నతాధికారులు, కార్మిక సంఘాలతో సమావేశం కాబోతున్నారు. పూర్తి స్థాయి ఉత్పత్తికి వర్కింగ్ క్యాపిటల్ లేక నష్టాల ఊబిలో ఉన్న స్టీల్ ప్లాంట్?ను సెయిల్?లో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు ఏపీ ఎంపీలు. ఇటీవల రాష్ట్ర బీజేపీ ఎంపీలు కుమార స్వామికి విజ్ఞప్తి చేసిన మేరకే కేంద్ర మంత్రి

### అన్న క్యాంటీన్ల పునః ప్రారంభానికి ముహూర్తం ఖరారు!



ఆగస్టు 15 నుంచి ప్రారంభించే విషయాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వం

టెండర్లు పిలిచి పనుల ప్రారంభించాలంటూ ప్రభుత్వం ఆదేశాలు

తొలి దశలో 183 క్యాంటీన్ల ఏర్పాటు

అమరావతి: కేవలం రూ.5 లకే ఆకలిని తీర్చే 'అన్న క్యాంటీన్లు' పునః ప్రారంభానికి ప్రభుత్వం చకచకా ఏర్పాట్లు చేస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న తొలి దశలో కొన్ని క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. అధికారికంగా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోయినప్పటికీ.. సాధ్యాసాధ్యాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. తొలి దశలో 183 క్యాంటీన్ల ప్రారంభించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. టెండర్లు పిలిచి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించింది.



వివరాలు 2లో..

### కూల్ కూల్ న్యూస్.. వచ్చే మూడు రోజులు ఈ ప్రాంతాల్లో భారీ వర్షాలు.. లేటెస్ట్ వెదర్ రిపోర్ట్..

పశ్చిమ బంగాళాఖాతంలో దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరం మీదగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఏర్పడింది.. దీని ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. షీర్ జోన్ లేదా గాలుల కోత సుమారుగా 20 పొడవున , సగటు సముద్ర మట్టానికి 3.1 న 5.8 కిమీల...

### ఆర్థిక సర్వేపై స్పందించే దమ్ము జగన్ కు ఉందా?



ఏపీలో గత ఐదేళ్లు విధ్వంసకర పాలన సాగిందన్న యనమల

ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందని వెల్లడి

ఏమీ చేయకుండానే అన్నీ చేసినట్టు గొప్పలు చెప్పుకున్నారని విమర్శలు

అందుకే ప్రజలు వైసీపీని ఓడించి బుద్ధి చెప్పారని వ్యాఖ్యలు

అమరావతి టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు మాజీ సీఎం జగన్ పై ధ్వజమెత్తారు. ఆర్థిక సర్వేపై

### కిడ్నీ విక్రయంపై ప్రభుత్వం సీరియస్.. నిందితుల కోసం పోలీసుల గాలింపు...



2లో

ఢిల్లీ : బెజవాడ, గుంటూరు కేంద్రంగా సాగుతోన్న ఈ కిడ్నీ దందా ఇప్పుడు ఏపీలో సంచలనం రేపుతోంది. ఇడ్లీలు అమ్మినంత ఈజీగా కిడ్నీలు కొట్టేస్తున్నారు కేటుగాళ్లు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవాళ్లను టార్గెట్‌గా చేసుకొని వల విసురుతోంది కిడ్నీ మాఫియా. ఒక్క కిడ్నీ ఇస్తే చాలు లైఫ్ సెటిలైపోద్ది అంటూ ఎరవేయడంతో నమ్మి మోసపోతున్నారు బాధితులు. కిడ్నీ గ్యాంగ్ కోసం వేట మొదలైంది. బాధితుడు మధుబాబు ఇచ్చిన ఇన్ఫర్మేషన్‌తో యాక్షన్‌లోకి దిగారు పోలీసులు. కేసు నమోదు చేసుకుని కిడ్నీ దందా వెనుకున్న బ్రోకర్లు బాషా, వెంకట్ కోసం గాలింపు ప్రారంభించారు. మొత్తం నాలుగు బృందాలతో ఆపరేషన్ స్టార్ చేశారు గుంటూరు పోలీసులు. ఇప్పటికే వెంకట్ సుబ్రమణ్యంలను గుర్తించారు పోలీసులు. బాషా కోసం గాలింపు ముమ్మరం చేశారు. నిందితుడు విజయవాడకు చెందిన వారిగా గుర్తించారు. విజయవాడలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగిన విజయ ఆస్పత్రికి ఈరోజు వెళ్లి వివరాలు సేకరించనున్నారు.

## రైతు రుణమాఫీ కోసం 32 వేల కోట్లు అవసరమవుతాయి...

కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రైతు రుణమాఫీ హామీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా రైతులకు శుభవార్త

ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రం మినహాయింపు ఇచ్చే అవకాశం

ఈ నిర్ణయం సహేతుకమైనదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి



హైదరాబాద్ : గత ఏడాది తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రైతు రుణమాఫీ అనే అంశం అత్యంత హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. గతంలో కేసీఆర్ రైతుబంధుకు కౌంటర్ గా ఈ హామీ తీసుకొచ్చారనే కామెంట్లు నాడు వినిపించాయి. అయితే ఈ హామీ అమలు విషయంలో రేవంత్ సర్కార్

మిగతా..2లో

## అన్న క్యాంటీన్ల పునః ప్రారంభానికి ముహూర్తం ఖరారు!

మొదటి పేజీ తరువాయి

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న తొలి దశలో కొన్ని క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. అధికారికంగా ఎలాంటి నిర్ణయం తీసుకోపోయినప్పటికీ.. సాధ్యాసాధ్యాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. తొలి దశలో 183 క్యాంటీన్లను ప్రారంభించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. టెండర్లు పిలిచి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. గతంలో నిర్మాణించిన క్యాంటీన్ భవనాలను ఆధునికీకరించి, అన్ని సౌకర్యాలతో సిద్ధం చేసే బాధ్యతను పట్టణ స్థానిక సంస్థలకు ప్రభుత్వం అప్పగించినట్టు తెలుస్తోంది.

టెండర్లు ఆహ్వానించిన ప్రభుత్వం

తొలి దశలో ప్రారంభించే 183 క్యాంటీన్లకు ఆహారం సరఫరా చేసే సంస్థ కోసం అధికారులు టెండర్లు పిలిచారు. టెండర్లు సమర్పించేందుకు ఈ నెల 22 చివరి తేదీగా ప్రకటించారు. ఈ నెలాఖరు లోగా టెండర్లు ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు క్యాంటీన్ల నిర్వహణకు దాతల నుంచి విరాళాలు సేకరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకు సంబంధించిన విరాళాలపై పన్ను మినహాయింపు దక్కే సూచనలు ఉన్నాయి. ఇక అన్న క్యాంటీన్ల పేరుతో ట్రస్ట్ ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం ఓ వెబ్‌సైట్‌ను కూడా అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నారు. కాగా టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన అన్న క్యాంటీన్లను వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మూతపడిన విషయం తెలిసిందే. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీ కూటమి తిరిగి అధికారంలోకి రావడంతో క్యాంటీన్లను తిరిగి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఎన్నికల ప్రచారంలో కూడా టీడీపీ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.

## స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగుతుందా?
## కేంద్రమంత్రి పర్యటన ఉద్దేశం ఏంటి..?

మొదటి పేజీ తరువాయి

పూర్తిస్థాయి ఉత్పత్తికి అవసరమైన వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వడంతో పాటు రాష్ట్ర భారతీయ జనతా పార్టీ చేసిన సెయిల్?లో విలీనం ప్రతిపాదన చర్చకు రాబోతోందా? ఒక పర్యటన 100 సమాధానాల కోసం ఎదురుచూస్తోంది. నేడు విశాఖకు కేంద్ర స్టీల్ మినిస్టర్ హెచ్ డీ కుమారస్వామి రాబో తున్నారు. స్టీల్ ప్లాంట్?లోనే బస చేయబోతున్నారు. రేపు ఉన్నతాధికారులు, కార్మిక సంఘాలతో సమావేశం కాబోతున్నారు. పూర్తి స్థాయి ఉత్పత్తికి వర్కింగ్ క్యాపిటల్ లేక నష్టాల ఊబిలో ఉన్న స్టీల్ ప్లాంట్?ను సెయిల్?లో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు ఏపీ ఎంపీలు. ఇటీవల రాష్ట్ర బీజేపీ ఎంపీలు కుమార స్వామికి విజ్ఞప్తి చేసిన మేరకే కేంద్ర మంత్రి పర్యటన సాగుతోందా?

నిర్వహణా నిధులు లేక తగ్గిన ఉత్పత్తి.. :- మూడేళ్ల క్రితం పెట్టుబడుల ఉపసంహరణ పేరుతో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కేంద్రం నిర్ణయం తీసుకోవడం అందరినీ ఆందోళనకు గురి చేసింది. ఉద్యోగులు అప్పటినుంచీ వివిధ రూపాల్లో నిరసన తెలియజేస్తున్నారు. గత మూడేళ్లుగా నిర్వహణా నిధులు లేక 60 శాతం ఉత్పత్తే వస్తోంది. తగినంత వర్కింగ్ క్యాపిటల్ లేక రూ. 20 వేల కోట్ల విలువైన మెషినరీ నిరుపయోగంగా ఉంది. 2022 నుంచి ఒక బ్లాస్టుఫర్నేస్-3 ఆపేయడంతో రెండున్నర మిలియన్ టన్నుల ఉత్పత్తి నిలిచిపోయింది. వైజాగ్ స్టీల్స్?కి చెందిన రాయబరేలీ ఫోర్జ్ వీల్ ప్లాంటును రూ.2వేల కోట్లకు అమ్మినా అవి ఎందుకు ఉపయోగపడలేదు. విశాఖలో ప్లాంట్?కు ఉన్న విలువైన 25 ఎకరాల స్థలాలను ప్లాట్లుగా వేసి అమ్మకానికి పెట్టారు. వీటిపై కోర్టులో కేసు ఉంది. కానీ తాజాగా చెన్నై, హైదరాబాద్?ని స్టీల్ స్టాక్ పాయింట్లతో పాటు, వివిధ నగరాల్లోని కార్యాలయ భవనాలను 500 కోట్లకు అమ్మేందుకు ప్రతిపాదించారు. ఈ దశలో మోదీ 3.0 ప్రభుత్వం తాజా రాజకీయ పరిస్థితుల్లో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

ఆశల పల్లకిలో.. :- విశాఖ స్టీల్ భవిష్యత్తుపై సరికొత్త ఆశలు చిగురిస్తున్నాయి. మూడు సంవత్సరాలకు పైగా ఉద్యోగుల ఆందోళన, జీతాలు సక్రమంగా ఇవ్వలేని పరిస్థితి, మెయింటనెన్స్ కోసం ఆస్తులు అమ్ముకోవాల్సిన దుస్థితిలో ఉన్న ఉక్కు ప్లాంట్?కి కేంద్ర స్టీల్ మంత్రి కుమారస్వామి ఈ సాయంత్రం వస్తున్నారు. ఉన్నతాధికారులు, రేపు కార్మిక నేతలతో సమావేశం కానున్నారు. కేంద్ర మంత్రి హోదాలో వస్తున్న నేపథ్యంలో మంత్రి ఏం చెబుతారు? సెయిల్లో విలీన ప్రతిపాదనపై ఎలా స్పందిస్తారనేది చాలా ఆసక్తిగా మారింది.

## 41 ఏళ్ల క్రితం ఇందిరాగాంధీ.. మళ్లీ ఇప్పుడు మోదీ!

మొదటి పేజీ తరువాయి

ఎయిర్ పోర్టులో ఆయనకు ఆస్ట్రియా విదేశాంగ మంత్రి అలెగ్జాండర్ స్కాలెన్ బర్గ్ తోపాటు ఆస్ట్రియాలో భారత రాయబారి శంభు కుమరన్ ఘన స్వాగతం పలికారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ప్రధాని మోదీ తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేశారు. వియన్నాలో అడుగుపెట్టినట్లు పేర్కొన్నారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. దీనిపై ఆ దేశ చాన్స్ లర్ కార్ల్ నెహమ్మెర్ స్పందించారు. 'వియన్నా చేరుకున్న ప్రధాని మోదీకి స్వాగతం. ఆస్ట్రియాకు స్వాగతించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. మన రాజకీయ, ఆర్థిక చర్చల కోసం ఎదురుచూస్తున్నా' అని నెహమ్మెర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అనంతరం మోదీ గౌరవార్థం హోటల్ రిట్జ్ %-%కార్ల్ టన్ లో ఏర్పాటు చేసిన ప్రైవేటు విందులో నెహమ్మెర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీతో కలిసి దిగిన ఫొటోను నెటిజన్లతో పంచుకున్నారు. మరోవైపు హోటల్ లోకి అడుగుపెట్టిన ప్రధాని మోదీకి ఆస్ట్రియా కళాకారులు, వయొలిన్ విద్వాంసులు వందేమాతరం గేయం ఆలపిస్తూ స్వాగతం పలికారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, భౌగోళిక, రాజకీయ సవాళ్లపై మరింత మెరుగైన సహకారం దిశగా ఆస్ట్రియాతో మోదీ చర్చలు జరపనున్నారు. ఆస్ట్రియా అధ్యక్షుడు అలెగ్జాండర్ వాన్ డర్ బెల్లెన్ తోపాటు ఆ దేశ చాన్స్ లర్ కార్ల్ నెహమ్మెర్ తో ప్రధాని మోదీ సమావేశం కానున్నారు. అలాగే ఇరు దేశాలకు చెందిన వ్యాపారవేత్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఆస్ట్రియా పర్యటనకు బయలుదేరే ముందు మోదీ మాట్లాడుతూ 'ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, చట్టపాలన విషయంలో భారత్%-%ఆస్ట్రియా ఒకే రకమైన విలువలను కలిగి ఉన్నాయి. ఆ పునాదులపై ఇరు దేశాలు మరింత సన్నిహిత భాగస్వామ్యాన్ని నిర్మించనున్నాయి' అని పేర్కొన్నారు. అంతకుముందు మోదీ పర్యటనను స్వాగతిస్తూ ఆస్ట్రియా చాన్స్ లర్ నెహమ్మెర్ 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. 'ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశ ప్రధాని నరేంద్ర మోదీతో భేటీకి ఎదురుచూస్తున్నా. ఈ పర్యటన ఎంతో ప్రత్యేకమైనది. 40 ఏళ్ల తర్వాత భారత ప్రధాని తొలిసారి మా దేశానికి రానున్నారు. భారత్ తో దౌత్య సంబంధాలు ఏర్పడి 75 ఏళ్లు పూర్తయిన సంబరాల వేళ మోదీ పర్యటన కీలక మైలురాయిగా నిలవనుంది' అని నెహమ్మెర్ పేర్కొన్నారు.

## బద్రీనాథ్ హైవే పై విరిగి పడిన భారీ కొండచరియలు..
## ప్రాణాల కోసం ప్రజలు పరుగులు..

మొదటి పేజీ తరువాయి

ఈ ఘటనకు సంబం ధించిన ఒక వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. 30 సెకన్ల నిడివి గల వీడియోలో జోషిమఠంలోని చుంగిధార్ వద్ద కొండ పెద్ద భాగం శిథిలమై రోడ్డుపై పడిపోవడం, పెద్ద రాళ్లు మార్గాన్ని అడ్డుకోవడం చూపిస్తుంది. ఇలా కొండ చరియలు విరిగి పడడంతో ప్రజలు భయాందోళనలతో కేకలు వేయడం, తమ భద్రత కోసం పరిగెత్తడం ఆ వీడియోలో కనిపిస్తోంది. అదే సమయంలో చాలా మంది తమ ఫోన్‌లలో కొండ చరియలు విరిగిపడుతుండగా బంధించడం కూడా కనిపించింది. కొండచరియలు విరిగిపడటంతో రోడ్డుకు ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. వందలాది మంది ప్రజలు, వాహనాలు ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. కొండచరియలు విరిగిపడటంతో అధికారులు బద్రీనాథ్ హైవేని బ్లాక్ చేసి శిథిలాలను తొలగిస్తున్నారు. శిథిలాలను తొలగించి రహదారిని తెరవడం కోసం రంగంలోకి దిగిన పోలీసులు, అధికారులు చర్యలు చేపట్టారు. అర్ధరాత్రికి రహదారి తెరవబడుతుందని తెలుస్తోంది. గత కొన్ని రోజులుగా ఉత్తరాఖండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కొండలపై కొండచరియలు విరిగిపడటంతో బద్రీనాథ్‌కు వెళ్లే హైవే అనేక ప్రదేశాల్లో శిథిలాల కారణంగా మూసుకుపోయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా భారీ సంఖ్యలో రోడ్లు మూసుకుపోయాయి. చంపావత్, ఉధమ్ సింగ్ నగర్ జిల్లాల్లోని అనేక గ్రామాలు భారీగా జలమయమయ్యాయి. చమోలిలో రెండు చోట్ల శిథిలాలు పడిపోవడం, పేరుకుపోవడంతో శుక్రవారం కూడా బద్రీనాథ్ హైవే మూసుకుపోయింది. రద్దీగా ఉండే భానర్‌పాని-పిపల్‌కోటి నాగ పంచాయతీ రహదారి, అంగ్థాలా రహదారిపై అంతరాయం ఏర్పడింది, చాలా మంది ప్రయాణికులు, స్థానికులు చిక్కుకుపోయారని వార్తా సంస్థ ఏఎన్‌ఐ వెల్లడించింది. శనివారం హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు పర్యాటకులు చమోలి జిల్లాలో కొండచరియలు విరిగిపడటంతో బండరాళ్లు ఢీకొని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం కొండచరియలు విరిగిపడిన శిథిలాల నుంచి వారి మృతదేహాలను బయటకు తీశారు. ఇదిలావుండగా రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసిన నేపథ్యంలో ఒకరోజు పాటు నిలిపివేసిన చార్ ధామ్ యాత్ర సోమవారం తిరిగి ప్రారంభమైంది. కొండచరియలు విరిగిపడటంతో రుద్రప్రయాగ్-కేదార్‌నాథ్ జాతీయ రహదారి కూడా మూసుకుపోయింది.

## భారత్-చైనా సరిహద్దుల్లో 108 కిలోల బంగారం పట్టివేత..!

మొదటి పేజీ తరువాయి

అయితే, సరిహద్దుల్లో ఇంత పెద్ద మొత్తంలో బంగారాన్ని పట్టుకోవడం ఐటీబీపీ చరిత్రలో ఇదే తొలిసారి. లడఖ్ సెక్టార్‌లో ఇద్దరు అనుమానితుల వ్యక్తుల నుంచి అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఐటీబీపీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. లడఖ్ ప్రాంతాల్లో పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో సెరిగాప్లే ప్రాంతంలో ఇద్దరు అనుమానితులను గుర్తించినట్లు తెలిపారు. వారిని విచారించగా ఔషధ మొక్కలను సేకరిస్తున్నామని చెప్పినట్లు పేర్కొంది. ప్రస్తుత సమయంలో చొరబాటు, స్మగ్లింగ్‌కు ఎక్కువ అవకాశాలు ఉండగా వారి వద్ద తనిఖీలు చేయగా 108 బంగారం దొరికినట్లు తెలిపారు. అలాగే, ఓ బైనాక్యూలర్, కొన్ని కత్తులు, చైనీస్ ఫుడ్, రెండు పోనీలు, మరో రెండు మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని.. మరో అనుమానిత వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఇద్దరు నిందితులను లడఖ్‌లోని హన్లీ గ్రామానికి చెందిన టెన్జింగ్ టార్గే (40), చెరింగ్ చంబా (69) గురించినట్లు పేర్కొన్నారు. లడఖ్, శ్రీనగర్ సెక్టార్‌లో ఐటీబీపీ తనిఖీలు చేస్తుందని చెప్పారు. అనుమానిత వ్యక్తులను తప్పించుకునేందుకు యత్నించగా పెట్రోలింగ్ పార్టీ పట్టుకుందని తెలిపారు. లడఖ్ పోలీసులతో సంప్రదింపులు జరుపుతున్నామని.. అనుమానితులను కస్టమ్స్ విభాగానికి అప్పగించనున్నట్లు అధికారులు వివరించారు.

## పవన్ కల్యాణ్ వార్నింగ్, ఎర్రచందనం తరలించిన కొందరు నాయకులు హడల్...

మొదటి పేజీ తరువాయి

అటవి శాఖలోని పెద్ద తలకాయల అండదండలతో వైసీపీ నాయకులు ఎర్రచందనం స్మగ్లింగ్ చేశారని టీడీపీ నాయకులు ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సీరియస్ గా వార్నింగ్ ఇవ్వడంతో ఇప్పుడు అటవి శాఖ అధికారులతో పాటు పోలీసుల్లో చలనం వచ్చిందని తెలిసింది. ఇంతకాలం మాట వినని అటవి శాఖ అధికారులు, సిబ్బంది, పోలీసులకు రాజమండ్రి, శ్రీకాకుళం, విశాఖ పట్టణంకు బదిలి చేశారు. నిబంధనలకు విరుద్ధంగా బదిలి చేసిన ఆ అధికారులు సిబ్బంది ఇప్పుడు మా భాగోతం ఎక్కడ బయటపెడుతారో అని ఇంతకాలం ఎర్రచందనం తరలించిన కొందరు నాయకులు హడలిపోతున్నారని తెలిసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి వేల కోట్ల రూపాయల విలువైన ఎర్రచందనం మాయం అయ్యిందని ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని శేషాచలం అడవులు, సదాశివకోన, తలకోన, నాగలాపురం, పిచ్చాటూరు తదితర అటవి శాఖ పరిధిలో విపరీతంగా ఎర్రచందనం చెట్లు ఉన్నాయి. ఈ ప్రాంతంలోని ఎర్రచందనంకు విదేశాల్లో విపరీతమైన డిమాండ్ ఉంది. పుష్పా సినిమా టైపులో ఎర్రచందనం స్మగ్లింగ్ కు స్కెచ్ వేసిన కొందరు నాయకులు చెన్నైలోని స్మగ్లర్లతో డీల్ మాట్లాడుకున్నారని, ఇంతకాలం అక్రమ మార్గాల్లో చెన్నైకి ఎర్రచందనం తరలించారని, అక్కడి నుంచి విదేశాలకు తరలించారని ఆరోపణలు ఉన్నాయి. తరువాత తమిళనాడు నుంచి కూలీలను పిలిపించుకుని రోజు వారికి వేలాది రూపాయలు కూలీలు



ఇచ్చి శేషాచలం అడవుల్లో ఎర్రచందనం చెట్లు కొట్టించారు. తరువాత వైసీపీ నాయకుల అండదండలతో ఎర్రచందనం దుంగలను అక్రమ మార్గాల్లో చెన్నైకి తరలించి వాటిని విక్రయించి భారీ మొత్తంలో డబ్బులు సంపాదించారని ఆరోపణలు ఉన్నాయి. చెక్ పోస్టుల్లో సహకరించని సిబ్బందిని అప్పటి వైసీపీ ప్రభుత్వంలోని కొందరు పెద్దలు వారిని వేరే జిల్లాలకు బదిలి చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఇంత దర్జాగా ఎర్రచందనం తరలిపోతున్నా గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని, అప్పటి అధికార పార్టీకి చెందిన అటవి శాఖ పెద్దలకు పూర్తిగా సహకరించారని, చిన్నాచితకా కేసులు నమోదు చేసి చేతులు దుపులుపుకున్నారని ఆరోపణలు ఉన్నాయి ఎర్రచందనం తరలిస్తున్న స్మగ్లర్ల మీద కేసులు నమోదు చెయ్యకుండా తమిళనాడుకు చెందిన కూలీల మీద కేసులు నమోదు చేసి కొన్ని కొన్ని ఎర్రచందనం దుంగలను రికవరీ చేసినట్లు కొందరు అధికారులు నాటకాలు ఆడారని ఆరోపణలు ఉన్నాయి. చెప్పినట్లు వినని కొందరు అధికారులను ఏదోఒక సాకుతో సస్పెండ్ చెయ్యడం, డిప్యుటేషన్ మీద వేరే ప్రాంతాలకు పంపించిన వైసీపీ నాయకులు అక్రమ మార్గాల్లో దర్జాగా ఎర్రచందనం వ్యాపారం చేశారని, తమిళనాడులోని చెక్ పోస్టుల్లో సిబ్బందిని కూడా వీరు ప్రలోభపెట్టారని ఆరోపణలు ఉన్నాయి.

ఎర్రచందనం స్మగ్లింగ్ విషయంలో ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎర్రచందనం స్మగ్లింగ్ చేసే వాళు ఎవరైనా సరే వదిలిపెట్టమని, పాత కేసులు తిరగతోడుతామని, ఎర్రచందనం స్మగ్లింగ్ చేసే వారికి సహకరించే అధికారులను కూడా వదిలిపెట్టనని డీసీఎం పవన్ కల్యాణ్ సీరియస్ గా వార్నింగ్ ఇచ్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చిత్తూరు, బాకరాపేట, చంద్రగిరి, పీలేరు, మదనపల్లె, గుడుపల్లె, తిరుపతి రూరల్, తిరుపతి అర్బన్ ప్రాంతాల్లో పని చేస్తున్న అటవి శాఖ అధికారులు, చెక్ పోస్టుల సిబ్బందికి ఇప్పుడు దడ మొదలైయ్యిందని తెలిసింది.

## మార్పు రావాలి... కాంగ్రెస్ రావాలి అంటే... మొత్తానికి పెద్ద మార్పే వచ్చింది

మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'జేఎన్టీయూ మెస్ చట్నీలో చిట్టెలుక' అనే వార్తా క్లిప్పింగ్‌ను ఆయన జోడిస్తూ... కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఆనాటి కాంగ్రెస్ పాలనలో.. ప్రభుత్వ హాస్టళ్లలో దుస్థితి.. పురుగుల అన్నం.. నీళ్ల చారు.. ఈనాటి కాంగ్రెస్ పాలనలో.. ప్రభుత్వ హాస్టళ్లలో ఇంకా అధ్వాన్న పరిస్థితి.. బల్లిపడిన టిఫిన్లు, చిట్టెలుకలు తిరిగే చట్నీలు అంటూ ఎద్దేవా చేశారు. మొన్న భువనగిరి సాంఘిక సంక్షేమ పాఠశాలలో కలుషిత ఆహారం తిన్న విద్యార్థి జీవితం విషాదంతమైందని... నిన్న కోమటిపల్లి హాస్టల్లో ఉప్మాలో బల్లి పడి 20 మంది విద్యార్థులకు వాంతులు చేసుకున్నారని గుర్తు చేశారు. సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ హాస్టల్‌లో చట్నీలో చిట్టెలుక దర్శనంతో ఇక్కడి విద్యార్థులు బెంబేలెత్తారన్నారు. ఈ విషాహారం తింటే.. విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఎవరు?? అల్లారుముద్దుగా పెంచుకున్న తల్లిదండ్రులకు భరోసా ఎక్కడ.. అని ప్రశ్నించారు. కలుషిత ఆహారం వల్ల... పిల్లలు ఆడుకోవాల్సిన వయస్సులో ఆసుపత్రుల పాలవు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అస్తవ్యస్థంగా మారిన ప్రభుత్వ వ్యవస్థ వల్లే విద్యార్థులకు ఈ అవస్థ వచ్చిపడిందని... దీంతో వారికి ఈ అస్వస్థత అని పేర్కొన్నారు. ఇకనైనా కాంగ్రెస్ సర్కారు కళ్లు తెరవాలని లేదంటే భావిభారత పౌరుల నిండు ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. వైఫల్యాలను సరిచేయకపోతే ఊహించని విషాదం చోటు చేసుకునే అవకాశాలు ఉంటాయని హెచ్చరించారు.సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ పరిశ్రమల శాఖకు చెందిన 20 వేల కోట్ల విలువైన 400 ఎకరాల ప్రభుత్వ భూములను ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలకు ప్రభుత్వం తనఖాపెట్టాలని యోచిస్తోందని సంచలన ఆరోపణలు చేశారు. రూ.10 వేల కోట్లు సమీకరించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం ఉందన్నారు. దీనికి మధ్యవర్తిగా ఒక మర్చంట్ బ్యాంకర్‌ను పెట్టి వారికి రూ.100 కోట్ల కమీషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైందని, ఈ మేరకు మీడియాలో కథనాలు వస్తున్నాయని కేటీఆర్ అన్నారు. ఈ మేరకు ఓ దిన పత్రికలో వచ్చిన కథనాన్ని కేటీఆర్ ఎక్స్ వేదికగా షేర్ చేశారు. రాష్ట్ర ఆర్థిక రంగాన్ని సరిగ్గా నడపడం రేవంత్ సర్కార్‌కు చేతకావడం లేదని, నిధుల సమీకరణకు ఒక ప్రమాదకరమైన మార్గం ఎంచుకుందని కేటీఆర్ అన్నారు. మతిలేని ఈ చర్య వల్ల తెలంగాణ ప్రగతి శాశ్వతంగా కుంటుపడుతుందని అన్నారు. కొత్తగా పెట్టుబడులు, పరిశ్రమలు రాక, ఉద్యోగాలు రాక, బిడ్డలకు కొలువులు రాకుండా పోయే ప్రమాదం



ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కోకాపేట, రాయదుర్గం వంటి ప్రాంతాల్లోనే ఎక్కువగా ఐటీ పరిశ్రమలు వస్తున్నాయని, అలాంటి చోట 400 ఎకరాలు ప్రైవేట్ సంస్థలకు తనఖా పెట్టడం అనాలోచిత చర్య అని కేటీఆర్ విమర్శించారు. అసలే గత 7 నెలలుగా రాష్ట్ర పారిశ్రామికరంగం స్తబ్దుగా ఉందని, కొత్తగా పెట్టుబడులు రావడం లేదని అన్నారు. ఉన్న కంపెనీలు కూడా సరైన ప్రోత్సాహం లేక పక్కచూపులు చూస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం పరిశ్రమలకు ఇచ్చే భూములు తాకట్టు పెడితే కంపెనీలకు ఏమిస్తారని ప్రశ్నించారు. కొత్తగా యువతకు ఉద్యోగాలు ఎలా వస్తాయని నిలదీశారు.

### ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో గంజాయి
## కలకలంపై మంత్రి లోకేశ్ ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి

దీనిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గంజాయి కలకలంపై సమగ్ర విచారణ జరపాలని అధికారులకు ఆదేశించారు. గంజాయిని ప్రోత్సహించే వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ట్రిపుల్ ఐటీలో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు మంత్రి లోకేశ్ ను కలిశారు. తమ పిల్లలను చేర్పించి నష్టపోతున్నామంటూ వారు వాపోయారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్ మొత్తం గంజాయికి అడ్డాగా మారిందని తెలిపారు. దీనిపై మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ... విద్యాలయాల్లో గంజాయి ఆనవాళ్లు లేకుండా నిర్మూలిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. గంజాయి నిర్మూలనకు ఇప్పటికే ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టిందని అన్నారు. ట్రిపుల్ ఐటీలో సమస్యను పరిష్కరించి విద్యార్థుల భవిష్యత్ ను కాపాడతానని భరోసా ఇచ్చారు.

## ఆర్థిక సర్వేపై స్పందించే దమ్ము జగన్ కు ఉందా?

మొదటి పేజీ తరువాయి

ఆర్థిక సర్వేపై స్పందించే దమ్ము జగన్ కు ఉందా? అని నిలదీశారు. ఏపీ ఆర్థిక వ్యవస్థ ఏ విధంగా కుప్పకూలిందో ఆర్థిక సర్వే 2022-23 ద్వారా స్పష్టంగా అర్థమవుతుందని అన్నారు. అమరావతి, పోలవరం, నదుల అనుసంధానం, పారిశ్రామిక రంగం, విద్యుత్... ఇలా అన్ని వ్యవస్థలను వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్లు విధ్వంసకర పాలన కొనసాగిందని అన్నారు. ఏమీ చేయకుండానే అన్నీ చేసినట్టు గొప్పలు చెప్పుకున్నారని విమర్శించారు. అందుకే, ప్రజలు వైసీపీకి తగిన బుద్ధి చెప్పి, తలరాతను తిరగరాశారని యనమల వ్యాఖ్యానించారు. వైసీపీ పాలనలో అన్ని రంగాలను నిర్లక్ష్యం చేసి గాలికి వదిలేశారని మండిపడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రులను నరక కూపాలుగా తయారుచేశారని, ఆరోగ్య శ్రీని అనారోగ్య శ్రీగా మార్చివేశారని విమర్శించారు. ఏపీలో నెలకొన్న భయానక పరిస్థితులతో ఒక్క పారిశ్రామికవేత్త కూడా ఇటువైపు చూడని పరిస్థితి నెలకొందని, ఉన్న పరిశ్రమలు వెళ్లిపోయాయని అన్నారు. వ్యవసాయ రంగం పరిస్థితి మరీ దారుణమని, వందేళ్ల వ్యవసాయ రంగ చరిత్రలో పాతాళానికి పడిపోయిన దుస్థితిని వైసీపీ ప్రభుత్వంలోనే చూశామని యనమల విమర్శించారు. జగన్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులు కూడా పూర్తి చేయలేకపోయిందని, అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వివరించారు. జగన్ తప్పుడు విధానాలతో ఆక్వారంగం బలైందని యనమల పేర్కొన్నారు. ఆక్వా విద్యుత్ రేట్ల పెంపునకు తోడు అవినీతి కూడా ప్రభావం చూపిందని తెలిపారు.

## కిడ్నీ విక్రయంపై ప్రభుత్వం సీరియస్..
## నిందితుల కోసం పోలీసుల గాలింపు...

మొదటి పేజీ తరువాయి



ఇడ్లీలు అమ్మినంత ఈజీగా కిడ్నీలు కొట్టేస్తున్నారు కేటుగాళ్లు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవాళ్లను టార్గెట్‌గా చేసుకొని వల విసురుతోంది కిడ్నీ మాఫియా. ఒక్క కిడ్నీ ఇస్తే చాలు లైఫ్ సెటిలైపోద్ది అంటూ ఎరవేయడంతో నమ్మి మోసపోతున్నారు బాధితులు. కిడ్నీ గ్యాంగ్ కోసం వేట మొదలైంది. బాధితుడు మధుబాబు ఇచ్చిన ఇన్ఫర్మేషన్‌తో యాక్షన్‌లోకి దిగారు పోలీసులు. కేసు నమోదు చేసుకుని కిడ్నీ దందా వెనుకున్న బ్రోకర్లు బాషా, వెంకట్ కోసం గాలింపు ప్రారంభించారు. మొత్తం నాలుగు బృందాలతో ఆపరేషన్ స్టార్ చేశారు గుంటూరు పోలీసులు. ఇప్పటికే వెంకట్ సుబ్రమణ్యంలను గుర్తించారు పోలీసులు. బాషా కోసం గాలింపు ముమ్మరం చేశారు. నిందితుడు విజయవాడకు చెందిన వారిగా గుర్తించారు. విజయవాడలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగిన విజయ ఆస్పత్రికి ఈరోజు వెళ్లి వివరాలు సేకరించనున్నారు. గతంలోనూ విజయవాడ-గుంటూరు కేంద్రంగా కిడ్నీ మాఫియా అరాచకాలు బయటపడటంతో ఈ కేసును సీరియస్‌గా తీసుకున్నారు పోలీసులు. ఈ రాకెట్ వెనుక ఎవరెవరి ఇన్వాల్‌మెంట్ ఉందో తేల్చే పనిలో పడ్డారు. హోంమంత్రి అనిత సైతం కిడ్నీ దందాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే కిడ్నీ బాధితుడు మధుబాబుకు మెరుగైన వైద్యం కోసం జిజిహెచ్?కు తరలించిన పోలీసులు. గార్లపాటి మధుబాబుకు పెళ్లైంది ఇద్దరు పిల్లలున్నారు. ఫేస్ బుక్ లో పరిచయం ఏర్పరచుకుని కిడ్నీ అమ్మకంపై మాయ మాటలు చెప్పారు. డబ్బుల కోసం నిందితుడిని నిలువునా దోచేశారు. ముప్పై లక్షలు ఇస్తామని ఆశచూపి మోసం చేశారు. రికార్డులు తారుమారు చేశారు. జూన్ 15న విజయవాడలోని విజయా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో కిడ్నీ ఆపరేషన్ చేశారు. అంతా అయిపోయాక లక్షా పదివేల రూపాయలు మాత్రమే చేతిలో పెట్టారు. బాధితుడు మధుబాబు మిగిలిన డబ్బులు ఇవ్వాలంటూ.. మధ్యవర్తి వెంకట్?ను అడగటం మొదలు పెట్టాడు. అయితే రక్త సంబంధీకుడుగానే కిడ్ని ఇచ్చావని నీకు డబ్బులు ఎందుకు ఇవ్వాలంటూ బాధితుడితో వెంకట్ ఎదురు తిరిగాడు. దీంతో మోసపోయానని తెలుసుకున్న మధుబాబు రెండు రోజుల క్రితం గుంటూరు ఎస్పీని ఆశ్రయించారు. ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఈ వ్యవహారాన్ని సీరియస్ గా తీసుకున్న పోలీసులు నిందితులను పట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

## కరెంట్ కోతలు విద్యుత్
## నిర్వహణ లోపానికి నిదర్శనం: హరీశ్ రావు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ : రాజధాని నగరం హైదరాబాద్‌లో కరెంట్ కోతలు విద్యుత్ నిర్వహణ లోపానికి నిదర్శనమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. హైదరాబాద్ సహా తెలంగాణలో కరెంట్ కోతలు ఉన్నాయన్నారు. విద్యుత్ సౌధ పక్కనే ఉన్న ఆనంద్ నగర్, మాసాబ్ ట్యాంక్‌లో రాత్రి నుంచి ఉదయం వరకు కరెంట్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడితే పట్టించుకునే వారే కరవయ్యారని మండిపడ్డారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి కరెంట్ కోతలను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గంటల కొద్దీ విద్యుత్ అంతరాయాలు అంటూ ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని హరీశ్ రావు జత చేశారు.

ఓయూలో పోలీసుల తీరును ఖండిస్తున్నాం

ఉస్మానియా యూనివర్సిటీ సాక్షిగా జర్నలిస్టుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నానని హరీశ్ రావు మరో ట్వీట్ చేశారు. డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నిరసనలు తెలియజేస్తుంటే, విధి నిర్వహణలో భాగంగా ఆ వార్తలు కవర్ చేయడమే ఆ జర్నలిస్టులు చేసిన తప్పా? అని ప్రశ్నించారు. జర్నలిస్టులను అరెస్ట్ చేయడం, బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించడం మీడియా హక్కును, స్వేచ్ఛను కాలరాయడమే అన్నారు. జర్నలిస్టుల పట్ల అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని మార్చుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. అదుపులోకి తీసుకున్న జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## రైతు రుణమాఫీ కోసం 32 వేల కోట్లు అవసరమవుతాయి...

మొదటి పేజీ తరువాయి

గతంలో కేసీఆర్ రైతుబంధుకు కౌంటర్ గా ఈ హామీ తీసుకొచ్చారనే కామెంట్లూ నాడు వినిపించాయి. అయితే ఈ హామీ అమలు విషయంలో రేవంత్ సర్కార్ చాలా జాగ్రత్తలు తీసుకుని, ఉన్నంతలో వ్యూహాత్మకంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తుంది. / గతంలో బీఆరెస్ అధికారంలో ఉన్నప్పుడు రైతుబంధు పథకం ఉండేది. ఎవరికి ఎన్ని ఎకరాలున్నా.. ఆ భూములు ఉన్న వ్యక్తి అమెరికాలో ఉన్నా, ఐటీ కట్టే స్థాయిలో ఉన్నా, అతడు ఎమ్మెల్యే అయినా, ఎంపీ అయినా, ఎమ్మెల్సీ అయినా, మంత్రి అయినా కూడా వారి భూములకు రైతు బంధు అందేది అనే విమర్శ విపరీతంగా వినిపించేది. దీనివల్ల ప్రభుత్వ సొమ్ము వృథా అవుతుందనే విమర్శలు బలంగా వినిపించేవి. ఈ సమయంలో రేవంత్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అవును... కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రైతు రుణమాఫీ హామీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా రైతులకు శుభవార్త అందించారు.. రైతు రుణమాఫీపై కీలక ప్రకటన చేశారు. ఇందులో భాగంగా.. ఆగస్టు 15వ తేదీ లోపు రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. రైతు రుణమాఫీ పూర్తి చేసే వరకూ ఇదే మాట మీద ఉంటానని వెల్లడించారు. ఇదే సమయంలో ఈ రైతు రుణమాఫీకి సంబంధించిన విధివిధానాలను మరో రెండు రోజుల్లో ప్రకటిస్తామని పేర్కొన్న రేవంత్... దీనికి సంబంధించిన మార్గదర్శకాలను అధికారులు సిద్ధం చేస్తున్నారని అన్నారు. ఇలా అధికారులు మార్గదర్శకాలు ప్రకటించిన వాటికి అనుగుణంగా అర్హుల జాబితాను సిద్ధం చేస్తామని.. రోజుల వ్యవధిలోనే ఈ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ జరిగిపోతుందని తెలిపారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... రైతు రుణమాఫీ విషయంలో మంత్రులు, ఎంపీలు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బిగ్ షాకిచ్చారు. వీరెవరికీ రుణమాఫీ వర్తింపచేయొద్దని నిర్ణయించారు! దీంతో... ఈ నిర్ణయంపై ఆసక్తికరమైన చర్చ జరుగుతుంది. ఈ నిర్ణయం సహేతుకమైనదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని అంటున్నారు. అయితే... ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రం మినహాయింపు ఇచ్చే అవకాశం నట్లు తెఉన్లుస్తుంది. ఇక ఈ రైతు రుణమాఫీ కోసం 32 వేల కోట్ల రూపాయలు అవసరమవుతాయని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇందులో 10వేల కోట్లు ఇప్పటికే సిద్ధంగా ఉండగా.. టీజీఐఐసీ భూములను బ్యాంకులకు తాకట్టు పెట్టడం ద్వారా మరో రూ.10 వేల కోట్లు, రుణాల రూపంలో మరో రూ.10వేల కోట్లను సమకూరుస్తున్నట్లు భావిస్తున్నారని అంటున్నారు!

## కూల్ కూల్ న్యూస్.. వచ్చే మూడు రోజులు ఈ ప్రాంతాల్లో భారీ వర్షాలు.. లేటెస్ట్ వెదర్ రిపోర్ట్..

మొదటి పేజీ తరువాయి

దీని ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. షీర్ జోన్ లేదా గాలుల కోత సుమారుగా 20 పొడవున , సగటు సముద్ర మట్టానికి 3.1,,5.8 కిమీల మధ్య ఎత్తుతో దక్షిణం వైపు ఏటవాలుగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణములో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ శాఖ వెల్లడించింది.

రాబోవు మూడు రోజులకు వాతావరణ సూచనలు :

ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ %డ% యానాం :- బుధవారం, గురువారం, శుక్రవారం: తేలికపాటి నుండి మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్నిచోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన గాలులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగముతో ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశముంది.

దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్:- బుధవారం, గురువారం, శుక్రవారం: తేలికపాటి నుండి మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన గాలులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగముతో ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశముంది.

రాయలసీమ:- తెలంగాణలో కూడా వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు తెలిపింది.

## ట్రైకర్ చైర్మైన్, ఉద్యమనేత బెల్లయ్యనాయక్ కి శుభాకాంక్షలు తెలిపిన మాలమహానాడు జాతీయ, రాష్ట్రం అధ్యక్షులు అద్దంకి దయాకర్, పిల్లి సుధాకర్



మానుకోట జిల్లా /హైదరాబాద్ **(గౌతమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ట్రైకర్ చైర్మైన్ గా నేడు హైదరబాద్ సంక్షేమ భవనంలో ప్రమాణ స్వీకారం చేసి పదవి భాద్యతలు స్వీకరించిన సామాజిక ఉద్యమనేత బెల్లయ్యనాయక్ అన్నకు శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సన్మానించిన మాలమహానాడు జాతీయ అద్యక్షులు అద్దంకి దయాకర్, రాష్ట్ర అద్యక్షులు పిల్లి సుధాకర్, జాతీయ ప్రదాన కార్యదర్శి భైరి రమేష్, జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్, రాష్ట్ర కో-ఆర్డినేటర్ బ్యాగరి వెంకటస్వామి, నాయకులు కల్లూరి సంజీవ, ఉపేందర్, వివిధ విభాగాల చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఎల్.హెచ్.పి.ఎస్ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణలో కార్పొరేషన్ పదవులకు గ్రీన్ సిగ్నల్!!

ఆశావాహుల లో చిగురించిన ఆశలు!!



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో **(గౌతమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో గత కొన్ని నెలల నుంచి ఎదురుచూస్తున్నాను నామినేటెడ్ కార్పొరేషన్ పదవులకు కాంగ్రెస్ ప్రభుత్వం విన్సీ కలుస్తూ ఇతరులు జారీ చేసినట్టు తెలుస్తుంది, గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో ఎంతోమంది సెకండ్ కేడర్ నాయకులు అధిష్టానం మేరకు రెబల్ అభ్యర్థులతో సహా ఎమ్మెల్యే టికెట్ రాకపోయినప్పటికీ ప్రభుత్వం ఆశావాహుల కోసం నష్టం జరగకుండా నామినేటెడ్ కార్పొరేషన్ పథకం ఇస్తామని అప్పట్లో హామీ ఇవ్వడం ఇటీవల పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడ్డ నామినేటెడ్ కార్పొరేషన్ పదవులను పార్టీ చేయడానికి రంగం సిద్ధం చేసింది, తెలంగాణలో మొత్తం 37 కార్పొరేషన్ పదవులను భర్తీ చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలుస్తుంది, ప్రతి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం సెకండ్ క్యాడర్ నాయకత్వం పూర్తిస్థాయిలో పనిచేయడం ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కడ కూడా అసమ్మతి రెబల్ అభ్యర్థుల బెడద లేకుండా కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా పనిచేసింది, అందుకే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి ప్రధాన కారణమని చెప్పవచ్చు, కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని దశాబ్దాల కాలం పనిచేసిన నాయకులను తప్పకుండా గుర్తిస్తూ తగిన పదవులు ఇస్తామని ముఖ్యమంత్రి ఎన్నికల ముందే ప్రకటించారు, ఇంతకాలం ఎదురుచూస్తున్న నామినేటెడ్ కార్పొరేషన్ పదవుల కోసం ఎదురుచూస్తున్న నాయకులకు ఊరట లభించింది, ఈ పదవులకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో నాయకులలో ఆశలు చిగురించాయి,

## డిఎస్సి పరీక్షలను వాయిదా వేయాలని తహశీల్దార్ కి వీనతిపత్రం అందజేసిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు





బయ్యారం **(గౌతమ్ న్యూస్):** ఇల్లందు నియోజకవర్గ మాజీ శాసనసభ్యురాలు బానోత్ హరిప్రియ నాయక్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కి డిఎస్సి పరీక్ష ను వాయిదా వేయాలని వినతి పత్రం అందజేయడం జరిగింది.డిఎస్సి పరీక్ష తేదీని మెరుగైన ప్రిపరేషన్ కోసం పరీక్షను వాయిదా వేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము.మా అభ్యర్థనతో అదనపు ప్రిపరేషన్ సమయాన్ని అందించడం వలన విద్యార్థులు మరింత క్షుణ్ణంగా చదువుకునేందుకు వీలు కలుగుతుంది.వారికి ఆత్మవిశ్వాసంతో పాటు మరియు స్పష్టతతో పరీక్ష కు సన్నద్ధం అవుతారు.విద్యార్థులకు ప్రయోజనం చేకూరటమే కాకుండా మన ప్రాంతంలో విద్య యొక్క మొత్తం నాణ్యత మరియు భవిష్యత్తు బోధన ప్రమాణాలకు దోహదం చేస్తుంది. ఈ యొక్క ఇబ్బందుల దృష్ట్య మేము టిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం తరఫున బయ్యారం మండలం తహశీల్దార్ గారికి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో బయ్యారం మండల టిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు బానోతు లక్ష్మణ్ నాయక్ ,యూత్ ఉపాధ్యక్షులు రేపాకుల వెంకన్న,గౌరారం మాజీ సర్పంచ్ తాటి వెంకన్న, యూత్ నాయకులు తొట్టి అనిల్ యాదవ్ , రేఖ యాకయ్య, నీలారపు సంపత్, కీర్తి ఉదయ్, భైగల్ల వీరబాబు చందు, సందీప్ తొట్టి హరీష్ పోతుగంటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ కేశనేని శివనాథ్ (చిన్ని) కు ఘన స్వాగతం





నందిగామ **(గౌతమ్ న్యూస్):** ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళుతున్న ఎంపీ శివనాథ్ కు నందిగామ వై జంక్షన్ వద్ద కూటమి శ్రేణుల ఘన స్వాగతం వై జంక్షన్ నుండి ర్యాలీగా కాకాని నగర్ కార్యాలయం చేరుకున్న ఎంపీ చిన్ని, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య , జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీమతి తంబళ్లపల్లి రమాదేవి తొలిసారిగా కార్యాలయానికి విచ్చేసిన చిన్నికి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేసిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి శ్రేణులు



# ప్రజా డాక్టర్ ప్రజల మనిషి "పగిడాల" కు పదవి ఇవ్వాలి!!

## కార్పొరేషన్ పదవి కోసం ప్రజల డిమాండ్!!

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో **(గౌతమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం నిరంతరం కృషిచేసి ప్రజల ఆదరాభిమానాలు పొందిన ప్రజా డాక్టర్ గా సీనియర్ రాజకీయ నాయకులుగా ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన డాక్టర్ పగిడాల శ్రీనివాస్ రెడ్డికి కార్పొరేషన్ పదవి ఇవ్వాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు, గతంలో తెలుగుదేశం పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా





అధ్యక్షులుగా కొల్లాపూర్ అసెంబ్లీ ఇన్చార్జిగా పనిచేసిన శ్రీనివాసరెడ్డి రాజకీయాలతో పాటు ప్రజా డాక్టర్ గా నిరంతరం ప్రజలకు వైద్య సేవలు అందించి కొల్లాపూర్ వనపర్తి నియోజకవర్గం వర్గాలలో పేరు ప్రతిష్టలు పొందిన ప్రజా డాక్టర్ గా రాజకీయ నాయకునిగా ఆయనకు పెట్టని పేరు ఉంది, అలాంటి నాయకుడు తన వైద్య వృత్తి తో పాటు ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వనపర్తి శాసనసభ్యులు మేఘా రెడ్డి గెలుపుతో పాటు కొల్లాపూర్ శాసనసభ్యులు ప్రస్తుత రాష్ట్ర ఎక్సైజ్ పర్యటక శాఖ మంత్రిగా జూపల్లి కృష్ణారావు గెలుపు కోసం డాక్టర్ శ్రీనివాసరెడ్డి ఎంతో కృషి చేశారు, తన వైద్య వృత్తిని పక్కనపెట్టి ఎన్నికలలో ప్రచారంలో ఆయన ముందుకు దూసుకుపోయి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయడం అభినందనీయం,అంతేకాక పార్లమెంటు ఎన్నికల్లో కూడా డాక్టర్ మల్లురవి పార్లమెంట్ సభ్యునిగా ఆఖరి కర్నూల్ నియోజకవర్గం నుంచి గెలిపించడంలో ఆయన కృషి పాత్ర మరువలేనిది నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని కొల్లాపూర్, వనపర్తి నియోజకవర్గాలు ఉన్నప్పటికీ ఆయా నియోజకవర్గాల్లో డాక్టర్ పగిడాల శ్రీనివాస్ రెడ్డికి ఉన్న పరిచయాలు పలుకుబడి ఉపయోగించి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేశారు, అలాంటి గొప్ప మనసున్న ప్రజా డాక్టర్ నిరంతరం పేద ప్రజల కోసం పరితపిస్తూ ఎవ్వరు అనారోగ్యంతో మరణించిన పంది పడ్డ నేనున్నానంటూ ప్రతి గ్రామంలో పేద ప్రజలను హక్కును చేర్చుకొని తన శక్తి మేరకు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవడంలో ఆయన ముందంజలో ఉన్నారు, ఇటీవల ముఖ్యమంత్రి మహబూబ్నగర్ పర్యటనలో వచ్చే స్థానిక



సంస్థ ఎన్నికల్లో ప్రతి కార్యకర్తకు గెలిపించు కుంటామని కార్పొరేషన్ పదవులతో పాటు నామినేటెడ్ పదవులను వెంటనే భర్తీ చేయాలని సంబంధిత మంత్రులు ఎమ్మెల్యేలు కార్పొరేషన్ పదవులను కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషిచేసిన నాయకులను గుర్తించేపనిలోఉండాలని ముఖ్యమంత్రి స్వయంగా పిలుపునిచ్చారు, అందుకోసం డాక్టర్ పగిడాల శ్రీనివాసరెడ్డికి తెలంగాణ రాష్ట్రంలో కార్పొరేషన్ పదవి ఇవ్వాలని ప్రజల నుంచి డిమాండ్లు వస్తున్నాయి, ఇందుకోసం నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ మల్లు రవి రాష్ట్ర ఎక్సైజ్ పర్యటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు వనపర్తి శాసనసభ్యులు మేఘా రెడ్డి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు,

# అంగన్వాడి సెంటర్లలో ఏకపక్ష నిర్ణయాలతో ఇబ్బందులు

మానుకోట జిల్లా **(గౌతమ్ న్యూస్):** మహబూబాబాద్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్, ఇందిరానగర్ సెక్టార్ పరిధిలోని విక్రంనగర్ అంగన్వాడి సెంటర్, యాదవనగర్ అంగన్వాడి సెంటర్లలో ఏకపక్ష నిర్ణయాలతో మాకు జరిగిన అన్యాయంపై చర్యల తీసుకోవాలి. పై విషయానుసారముగా మహబూబాబాద్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఇందిరానగర్ సెక్టార్ పరిధిలోని విక్రంనగర్ అంగన్వాడి సెంటర్లో పనిచేయుచున్న పెరుగు వరలక్ష్మి భర్త లేట్ ప్రతాప్ మరియు ఎండి.మహమూదా యాదవనగర్ అంగన్వాడి సెంటర్కు చెందిన మేము తమకు విన్నవించునది ఏమనగా, మా ఇరువురిపై వేరు వేరుగా మేము పనిచేయుచున్న కట్టెలమండె ఎంపిపిఎస్ పాఠశాలలో క్లబ్ చేయబడిన సహచర క్రిష్ణకాలని అంగన్వాడి టీచర్ పి. మాధవి మరియు ఇందిరానగర్ ఎంపిపిఎస్ పాఠశాలలో క్లబ్ చేయబడిన ఇందిరానగర్ అంగన్వాడి సెంటర్ హెల్పర్ (ఆయా) గజ్జెల ఉపేంద్రమ్మలు వేరువేరుగా మీ ఇరువురిపై తప్పుడు ఫిర్యాదు చేసినారు. ఆ తర్వాత మా ఇందిరానగర్ సెక్టార్ సూపర్వైజర్ ఉషారాణి మరియు సి.డి.పి.ఓ. లు ఏకపక్ష విచారణ జరిపి ఉద్దేశ్య పూర్వకంగా పరిష్కరించవలసిన సమస్యను పరిష్కరించకపోగా ఫిర్యాదుదారు వాంగ్మూలం మాత్రమే తీసుకుని పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంల తేది.16.05. 2024 రోజున మెమో నెం. ఎ/44 పేర సి.డి.పి.ఓ.ఎస్. రాజ్యలక్ష్మి పేర ఇచ్చినారు. దీనిపై మాయొక్క సంజాయిషీ మరియు వ్రాతపూర్వకంగా ఇచ్చినాము. మెమో నెం. ఎ/44 ఐసిడిఎస్ ప్రాజెక్ట్, మహబూబాబాద్ తేది. 16.05.2024 మెమోలో సూచించిన అంశాలు కాకుండా తేది. 21.05.2024న మరొక మెమోలో ఇతర కారణాలు పేర్కొంటూ మెమోలు ఇచ్చినారు. ఈ మెమోలో కూడా మా మధ్య ఉత్పన్నమైన సమస్య పరిష్కరించకుండానే మరొక పరిష్కారం అనగా క్లబ్ అయిన సెంటర్ల నుండి మీ స్వంత సెంటర్లకు వెళ్లాలని పేర్కొనడం జరిగింది. మళ్లీ తిరిగి 12.06.2024న ఒక మెమో సూపర్వైజర్ ఉషారాణి పేరుతో ఇచ్చినారు. ఈ క్రమంలో మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ మురళీనాయక్ కి మరియు జిల్లా సంక్షేమ అధికారి (డబ్ల్యుసిడిఎస్సి) వరలక్ష్మి మేడం కి మీకు ఇచ్చిన మెమోలపై



సంబంధిత సమస్యలపై విన్నవించుకోవడం జరిగింది. ఈ క్రమంలో స్వయంగా ఎమ్మెల్యే, పి.డి వరలక్ష్మి తో చర్చించారు, అయినప్పటికి ఆతర్వాత కొన్ని రోజులు గడిచిన తర్వాత 05.07.2024న మరొక మెమోను ఎ2/ఐసి..డి.ఎస్/22/2024న జిల్లా సంక్షేమ అధికారి, డబ్ల్యుసిడిఎస్సి వరలక్ష్మి పేరున మరొక మెమో మరియు మూడు రోజుల తర్వాత తేది. 08.07.2024న మరొక మెమో ఎ/38/ఐసిడిఎస్, సిడిపిఓ (ఐసిడిఎస్) పేరున వేర్వేరు కారణాలతో ఇవ్వడం జరిగింది. ఇచ్చిన ప్రతి మెమోలో ఒక దానికి మరొక దానితో పొంతన లేకుండా మొదటి మెమోలో టీచర్ల మధ్య వివాదం అని, రెండవ మెమోలో కౌన్సిలర్ల సమస్య అని మూడవ మెమోలో పిల్లల తల్లిదండ్రుల సమస్య అని మరియు 4వ మెమోలో ప్రాంతాల పేరున, 5వ మెమోలో సంఖ్య పేరున ఇలా రకరకాల పేర్లతో మాపై ఉద్దేశ్యపూర్వకంగా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. కావున ఇందిరానగర్ సెక్టార్ సూపర్వైజర్ ఉషారాణి, సి.డి.పి.ఓ రాజ్యలక్ష్మి, యు.డి.సి రాజు, పి.డి వరలక్ష్మి పై శాఖాపరమైన చర్యలు తీసుకోగలరని మనవి చేస్తున్నాము. 2017లో గత ప్రభుత్వం (ఇసిసిఇ) ఉన్న వాళ్లు పాలసీ ప్రకారం మమ్ములను క్లబ్ చేయడం జరిగింది. ఈ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్న సమయంలో ఇలాంటి నిర్ణయాలు తీసుకుని అధికారులు ఇలాంటి చర్యలకు పూనుకోవడం సరికాదని యధావిధిగా మమ్ములను కొనసాగించాలని, మాపై తప్పుడు ఫిర్యాదులు చేసిన వారితో అధికారులు ఏకీభవించడం సరికాదని మమ్ములను యధావిధిగా క్లబ్ చేసిన అంగన్వాడి సెంటర్లలో కొనసాగించాలని కోరుతున్నాం. స్వమంగా కలెక్టర్ కి ఇవ్వడం జరిగింది. స్పందించిన కలెక్టర్ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో ఏఐటీయూఎల్ నేతలు. శేషపల్లి నవీన్, మంద శంకర్, పెరుగు కుమార్, తండ శ్రీనాథ్ పాల్గొన్నారు.

# సింగరేణి హెడ్ ఆఫీస్ ముట్టడి విజయవంతం

## బొగ్గుగనుల ప్రైవేటీకరణ పై భగ్గుమన్న శ్రామిక సంఘాలు.

## ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ కే సాబీర్ పాషా.

భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి **(గౌతమ్ న్యూస్):** కొత్తగూడెం : బొగ్గు బ్లాకుల ప్రైవేటీకర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన సింగరేణి హెడ్డాఫీసు ధర్నా హొరెత్తింది. ప్రైవేటీకరణను నిరసిస్తూ కార్మిక సంఘాలు, విపక్ష పార్టీలు నిర్వహిస్తున్న దశలవారీ ఆందోళనా



కార్యక్రమాల్లో భాగంగా బుధవారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. కేంద్ర నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు, సిపిఐ జిల్లా




కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా మాట్లాడుతూ కేంద్రం తీసుకున్న బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ నిర్ణయం తెలంగాణలోని సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసే కుట్రలో భాగమేనని అన్నారు. బొగ్గు ఉత్పత్తిలో వందేళ్లకుపైగా అనుభవం ఉన్న సింగరేణి సంస్థకు బొగ్గు బ్లాకులను కేటాయించాల్సిన కేంద్రం అదానీ, అంబానీ లాంటి మిత్రులతో కుమ్మక్కై జాతీయ సంపదను దోచిపెట్టేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని విమర్శించారు. తెలంగాణలోని బగ్గు గనులు ప్రైవేటీకరిస్తే సింగరేణి ప్రాంతాలకు మనుగడ ఉండదని, కార్మికుల హక్కులు హరించుకుపోవడంతోపాటు తొలగింపు ప్రక్రియను వేగవంతం చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థ లేని తెలంగాణను చూడలేమని, సింగరేణి కార్మికుల ఉద్యమం వల్లే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రము ఏర్పాటైందని అలాంటి సింగరేణిని లేకుండా చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కేంద్రం నిర్ణయంతో సింగరేణి కార్మికులు ఆందోలకు గురి అవుతున్నారని వీరికి కోల్ బెల్ట్ ప్రాంతాల ఎమ్మెల్యేలు, ఎంపీలు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. భేషరతుగా సింగరేణి సంస్థకు బొగ్గు బ్లాకులను అప్పగించాలని లేనిపక్షంలో కోల్ బెల్ట్ ప్రాంతాలను స్తంభింప చేస్తామని హెచ్చరించారు. కార్మిక సంఘాల జిల్లా నాయకులు నరాటి ప్రసాద్, ఇజ్జగిరి శ్రీనివాస్, దమ్మాలపాటి శేషయ్య, యాకూబ్ షావలి, జాటోత్ కృష్ణ, వీరన్న తదితరులు కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సిపిఐ నాయకులు, వంగ వెంకట్, రమణమూర్తి, కంచర్ల జమలయ్య, గనిగల వీరాస్వామి, జక్కుల గట్టయ్య, కిష్టాఫర్, ఎస్.కె హుమాయున్, మధు కృష్ణ,భూక్యా దస్రు, రత్నకుమారి, భూక్యా శ్రీనివాస్, యూసుఫ్, ధర్మరాజు, ఎస్.కె ఫయుం, బరిగెల భూపేష్, ఎస్కే ఖయ్యూం, అంకుష్ సీఐటీయూ నాయకులు రాజారామ్, సామర్ల సమ్మయ్య,ఇఫ్టూ నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు



మెట్ పల్లి (గౌతమ్ న్యూస్): మున్నూరు కాపు దుబ్బావాడ సంఘం ఆధ్వర్యంలో వనభోజనాల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.. పట్టణంలోని రేగుంట పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించి యాటను బలించి ఏడదంతా పిల్లాపాపలను కాపాడుతూ పాడి పంటలు పండేలా దీవించాలని అమ్మవారిని కోరుకున్నారు. అనంతరం వనభోచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం దుబ్బావాడ అధ్యక్షుడు తోట ప్రసాద్, ఉపాధ్యక్షుడు జయపాల్, ఉసికెల లక్ష్మణ్, దొనికేల నవీన్, ఆగ సురేష్, సభ్యులు నునుగొండ చంద్రమోహన్, గందే వేణు గోపాల్, దొమ్మటి శంకర్, తోట శివ కుమార్, దోమకొండ రమేష్ మున్నారు కాపు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## నాలుగు సెల్ ఫోన్లు రికవరీ



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో **(గౌతమ్ న్యూస్):** వనపర్తి మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన నలుగురు వ్యక్తులకు సంబంధించిన సెల్ ఫోన్ లు చాకచక్యంగా సి ఈ ఐ ఆర్ కోడి ద్వారా స్వాధీనం చేసుకున్నట్లు వనపర్తి రూరల్ ఎస్సై జలంధర్ రెడ్డి తెలిపారు, బుధవారం స్వాధీనం చేసుకున్న సెల్ఫోన్లను బాధితులు మన్యపు మన్యం, బై రోజు వెంకటయ్య, గొర్ల రాధాకృష్ణ, శివ అనే వ్యక్తులకు అందజేసినట్లు ఆయన తెలిపారు, ఈ మధ్యకాలంలో సెల్ఫోన్ దొంగతనాలు ఎక్కువ జరుగుతున్నాయని ప్రతి ఒక్కరు తమ తమ సెల్ ఫోన్లు , లాప్టాప్ లు తగు జాగ్రత్తగా ఉంచుకోవాలని ఎస్ఐ కోరారు, ఈ సందర్భంగా దోపిడికి గురైన సెల్ఫోన్లను స్వాధీనం చేసిన ఎస్సై జలంధర్ రెడ్డి కి బాధితులు అభినందనలు తెలిపారు,



## రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు

తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు




మానుకోట జిల్లా (గౌతమ్ న్యూస్): ఆగస్టు 22,23,24 తేదీలలో హనుమకొండలో జరిగే సిపిఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు పిలుపు. బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల సమావేశంలో తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ సమావేశాన్ని నియోజకవర్గాల వారీగా వచ్చే జయప్రదం చేయాలి. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శిలు బి.విజయసారథి, మేకల రవి సిహెచ్ రాజారెడ్డి, కర్రె బిక్షపతి, రాజ్ కుమార్ తోట మల్లికార్జునరావు, సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నేదునూరి జ్యోతి, వెంకట్ రాములు, తమ్మెర విశ్వేశ్వరరావు, బి.అజయ్ సారధి రెడ్డి, నల్లు సుధాకర్ రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, జంపాల రవీందర్, పంజాల రమేష్, షేక్ బాసుమియా, పాతూరి సుగుణమ్మ, పనస ప్రసాద్, సిపిఐ ఉమ్మడి జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పండ్ల మొక్కలు నాటిన మొక్కల రాజశేఖర్ ను అభినందించిన పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ఎం. ప్రభుదేయాల్



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రతి పాఠశాలలో "స్కూల్ గార్డెన్" పెట్టాలని వారు ప్రకృతి ప్రేమికులకు మొక్కల లిస్టు ఇచ్చారు, ప్రకృతి హరిత దీక్ష మరియు ప్రతీ రోజు మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా కొట్టూరునుర్వి రాజశేఖర్ అలియాస్ మొక్కల రాజశేఖర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల రామవరం నందు ప్రధాన ఉపాధ్యాయుడు ఎం. ప్రభు దయాళ్ తో మరియు టీచర్స్,విద్యార్థినీ విద్యార్థులతో స్కూల్ గార్డెన్ మొక్కలు మరియు వివిధ పండ్ల మొక్కల ,కొబ్బరి ,అల్ల నేరేడు ,వాటర్ ఆపిల్,జామ వివిధ రకాల మొత్తం 100మొక్కలు తెచ్చి నాటి నారు, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ప్రభూ దయాల్ ప్రపంచ పర్యావరణ పరిరక్షణ కోసం వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి మొక్కలు నాటుతున్న మొక్కల రాజశేఖర్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు రాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా (రైతు బందు) నిదులు రైతులకు ఇవ్వక పోవటం విచారకరం

**కోండపల్లి రామచందర్ రావు టిడిపి పార్లమెంట్ అద్యక్షులు**



మానుకోట జిల్లా (గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెల రోజులు కావస్తూన్న రైతు భరోసా (రైతు బందు) నిదులు రైతులకు ఇవ్వక పోవటం విచారకరం అని కోండపల్లి రామచందర్ రావు టిడిపి పార్లమెంట్ అద్యక్షులు మహబూబాబాద్ అన్నారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ సకాలంలో వర్షాలు పడుటం వలన రైతుల వద్ద డబ్బు లేక సాగుకు పెట్టుబడి కోరకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చెసి విత్తనాలు, పురుగు మందులు తెచ్చి పంటలు సాగు చెస్తుంటే ప్రభుత్వం రైతుభరోసను ఇప్పటి వరకు వెయ్యకుండా రైతుల వద్దకు మంత్రుల కమిటీల పర్యటనల పేరుతో కాలయాపన చెస్తూరైతుల మద్య విభేదాలు సృష్టిస్తుందని విమర్శించారు. గత ప్రభుత్వం ప్రవేశం పెట్టిన రైతుబందు ఎకరానికి 10 వేలుఇస్తుంటే, మేము అధికారంలోకి వస్తే రైతుభరోసా ఎకరానికి 15 వేలు ఇస్తామనిచెప్పి, అధికారంలోకి వచ్చిన తరువాత గత ప్రభుత్వం గుట్టలకు, రోడ్లకు, వెంచర్లకు రైతుబందు ఇచ్చి దుర్వినియోగం చేసిందని, వాటిని సరిచెసి సాగుచెసె రైతులకు ఇస్తామని చెప్పటాన్ని అందరు రైతులు స్వాగతించారు. కాని ప్రభుత్వం ఇంతవరకు రైతులకు రైతుభరోసా ఇవ్వకుండా రైతుల మద్య విభేదాలు సృష్టించె విదంగా 5 ఎకరాలకు ఇవ్వలా, 10 ఎకరాలకు ఇవ్వాలని లికులు ఇస్తూ కాలయాపనా చెస్తుందని అన్నారు. రైతులకు ప్రభుత్వం ఎంత చెసిన తక్కవె అని, ఇప్పటికైన ప్రభుత్వం అర్దం చేసుకోని రైతు భరోసా విషయంలో ఎకరాలతో లిమిట్ లెకుండ సాగు చెసె ప్రతి రైతుకు వ్యవసాయ అధికారుల ద్వారా వెంటనె ఎంక్వైరీ చెసి రైతు భరోసా నిదులు విడదల చెయాలని, అలాగే కౌలు రైతులకు కూడ రైతు భరోసా నిదులు విడదల చెయాలని డిమాండ్ చెసారు.

## అసిస్టెంట్ ప్రభుత్వ న్యాయవాదిగా నియమకమైన అబ్దుల్ హాఫీజ్ నీ .సన్మానం



మెట్టుపల్లి (గౌతమ్ న్యూస్): పట్టణం లో అసిస్టెంట్ ప్రభుత్వ న్యాయవాది గా అబ్దుల్ హాఫీజ్ నియామకం . అసిస్టెంట్ ప్రభుత్వ న్యాయవాది గా నియమకమైన అబ్దుల్ హాఫీజ్ నీ .సన్మానం చేసిన మాజీ మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ శ్రీ ఎర్రోళ్ల హన్మాండ్లు యాదవ్ ఎలక్ట్రికల్ మోటార్ వైన్డర్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు శ్రీ సయ్యద్ సాజిద్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా మాజీ వైస్ ప్రెసిడెంట్ శ్రీ అఖ్తర్ జాని రజీయొద్దీన్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపణవేని తిరుపతి మరియు యండి ఫసి ఫ్రూట్ మర్చంట్ అసోషషన్ ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు ఉద్యోగుల పెన్షన్ పెంచుటకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి హామీ

సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దండం రాజు రామచంద్రరావు.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగారపు కిషన్ రెడ్డి ని హైదరాబాదులో ఆయన నివాసం లో కలిసి బొగ్గు రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ పెంపొందించుటకు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రాంచందర్ రావు మరియు అఖిల భారత పెన్షన్ ఉద్యోగుల కన్వీనర్ పి కే సింగ్ రాథోర్ తరపున రెండు వినతి పత్రాలు ఇవ్వడం జరిగినది ఆయన సానుకూలంగా స్పందిస్తూ ఇటీవలనే సింగరేణి రిటైర్డ్ డైరెక్టర్ దత్తాత్రేయలు ఈ విషయంలో కలిసినారని త్వరలోనే సంబంధిత అధికారులతో చర్చించి పెన్షన్ పెంచుటకు కృషి చేస్తానని హామీ ఇచ్చినారు ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి మేడూరి విజయ బాబు ప్రధాన కార్యదర్శి బానయ్య ఉప ప్రధాన కార్యదర్శి వేణు మాధవ్ ఇతర కార్యవర్గ సభ్యులు బీరయ్య,నర్సింగరావు కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలి

## జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.




భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. విద్యాశాఖ శిక్షణ మందిరం, పాత కొత్తగూడెంలో జరిగిన జిల్లాలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు విలువలతో కూడిన విద్యను అందించటం, తద్వారా విద్యార్థులను సమర్థవంతమైన పౌరులుగా తీర్చిదిద్దడం గురువుల బాధ్యత అని తెలియజేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులలో భేషజాలకు పోకుండా తక్కువ ఖర్చుతో పిల్లలకు సకల సదుపాయాలను ఎలా కలుగజేయవచ్చు ఉదాహరణతో సహా వివరించారు. అదేవిధంగా వనమహోత్సవంలో భాగంగా పాఠశాలల్లో తప్పనిసరిగా చింత, ఉసిరి, వెలగ, కరివేపాకు, మునగ మొక్కలను తప్పనిసరిగా నాటాలని అదేవిధంగా వివిధ పూల మొక్కలతో ఫ్లవర్ బెడ్స్ తయారు చేయాలని సూచించారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడం కోసం వర్క్ షీట్స్ అందించనున్నట్లుగా తెలిపారు. ఈ వర్క్ షీట్స్ను ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పిల్లలచే సమర్థవంతంగా వినియోగింప చేసి పిల్లలలో విద్యా ప్రమాణాల పెంపుతూ కృషి చేయాలని తద్వారా జిల్లాను విద్యాపరంగా ఉన్నత స్థానంలో నిలపాలని తెలిపారు. ఉదయం జరిగిన సమావేశంలో జిల్లా ఎడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ విద్యాచందన గారు మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులలో గొప్ప పురోగతి సాధించామని, ఇదే స్ఫూర్తితో మిగిలిన పాఠశాలల్లో కూడా పనులను పూర్తిచేయాలని ఇప్పటికే పూర్తయిన పనులకు సంబంధించిన ఆయా పాఠశాల కమిటీలకు అందజేశామని తెలియజేశారు. వనమహోత్సవంలో గౌరవ జిల్లా కలెక్టర్ గారి సూచనలు మేరకు అన్ని పాఠశాలల్లో మొక్కలు నాటాలని తెలియజేశారు. పిల్లలకు ఏకరూప దుస్తులను సకాలంలో అందజేయడానికి సహకరించిన ప్రధానోపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో సాంకేతిక పరమైన సమస్యలకు వాటికి సంబంధించిన అంశాలను జిల్లా రహదారులు మరియు భవనాల శాఖ ఈ.ఈ గారు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకటేశ్వర చారి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ నాగరాజశేఖర్, కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి ఎస్కే సైదులు, ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎన్ సతీష్ కుమార్, బాలిక విద్య కోఆర్డినేటర్ కే అన్నామని, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్ మాధవరావు, సమగ్ర శిక్ష ఫైనాన్స్ ఆఫీసర్ ఎస్ శ్రీనివాస్ రావు, జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, మండల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం అప్పు ఎవరికి ముప్పు!!

## గత ప్రభుత్వం అప్పు బయట పెట్టాలి!!

## అప్పుల పేరుతో ప్రజల తిప్పలు!!



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో (గౌతమ్ న్యూస్): ఏది ఏమైనా అధికారంలోకి రావడమే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఓటర్లను గాలమేయ్యడానికి తైలాలు ప్రకటిస్తూ ఆకర్షణీయమైన పథకాలను అమలు చేస్తామని చెప్పడంతో దేశంలో రాష్ట్రంలో ప్రజలు ఆయా పార్టీలకు పట్టం కట్టడం మానవాతీగా వస్తుంది, కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని రాష్ట్రంలోని ప్రజల పైన పెడుతున్న భారం అప్పులు ఏ మేరకు ప్రభుత్వాలు చేస్తున్న సంగతి ప్రజలు గమనిస్తున్నప్పటికీ గుడ్డిగా ఉచిత పథకాలకు ఆకర్షితులై పార్టీలను గద్దెనెక్కిస్తున్నారు, తెలంగాణ రాష్ట్రంలో 2014 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో అప్పటి టిఆర్ఎస్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర



రావు రైతు బంధు పథకం ద్వారా ఎకరాకు 5000 రూపాయల చొప్పున రైతులకు పెట్టుబడి సహాయం అందిస్తామని, అదేవిధంగా ఆసరా పెన్షన్ల పథకం ద్వారా వితంతులు ,వృద్ధులు ఒంటరి మహిళలకు నెలకు 3000 చొప్పున పెన్షన్ పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు హామీ ఇవ్వడంతో రెండు పర్యాయాలు ఈ రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం పరిపాలించింది, కానీ 9 సంవత్సరాల టిఆర్ఎస్ పరిపాలనలో ఈ రాష్ట్రంలో 7 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందని అందుకు 30 వేల కోట్ల కోట్ల రూపాయలను కేవలం వడ్డీ రూపంలో చెల్లిస్తున్నట్లు 2023 డిసెంబర్లో జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా టిఆర్ఎస్ పార్టీ చేసిన అప్పును బయటపెట్టారు, తాను ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన రోజు రాష్ట్ర ఖజానాలో చిల్లి గవ్వ కూడా లేదని కేవలం లోటు బడ్జెట్ తో తాను ముఖ్యమంత్రిగా సంతకం చేసి బాధ్యతలు స్వీకరించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు, అంతా బాగున్నప్పటికీ గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రాష్ట్రంలో గత ప్రభుత్వంలో ఇచ్చిన హామీల కంటే అధిక మొత్తంలో భారీ లక్షల కోట్ల రూపాయల వ్యయంతో కూడుకున్న హామీలను ఇచ్చారు, అందులో ప్రధానంగా రెండు లక్షల రుణమాఫీ పథకం కోసం 31 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం ఇప్పుడు సమకూర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది, అంతేకాక రైతు పరస పథకం ద్వారా ఎకరాకు 7500 చొప్పున ఖరీఫ్, యాసంగి పంటలకు సంబంధించి 20వేల కోట్ల రూపాయల ఖర్చు చేయాల్సి వస్తుంది, వీటితోపాటు మహాలక్ష్మి పథకం పేరుతోన రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా మహిళలు ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసే సౌకర్యం గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్లలోపు విద్యుత్తు




ఉచితంగా ప్రజలు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించింది, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గతంలో ఉన్న ఐదు లక్షల రూపాయల నుంచి ఏకంగా 10 లక్షల వరకు ఎలాంటి రోగం వచ్చిన ప్రజలు కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్స పొందే అవకాశం కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించింది, దీనితోపాటు ఆసరా పెన్షన్లు ఏకంగా డబల్ చేసింది ఇప్పటికి ఆసరా పెన్షన్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పెంచిన పెన్షన్లు రాక పెన్షన్ దారులు నిరుత్సాహానికి గురవుతున్నారు, ఊహించని హామీలు లక్షల కోట్ల రూపాయల విలువ చేసే మహామీలను కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇవ్వడం వల్లనే ఈ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని చెప్పవచ్చు, గత ప్రభుత్వం ఈ రాష్ట్రాన్ని అప్పుల కుప్పలుగా చేసినప్పుడు ఈ రాష్ట్రాన్ని ఏ విధంగా ధనిక రాష్ట్రంగా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టెక్కిస్తుందని ప్రజలు అనుమానిస్తున్నారు, ఈ రాష్ట్రం అప్పుల ఊబిలో ఉందని స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించారు, అలాంటి ఈ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏ విధంగా అమలు చేస్తుందని విమర్శలు కూడా వస్తున్నాయి, వీటితోపాటు డిసెంబర్ లోపు 2 లక్షల



ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రతి ఒక్క కులానికి ఒక భరోసా కల్పిస్తూ కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీతో పాటు సోనియా గాంధీ ప్రియాంక గాంధీ ఈ రాష్ట్ర ప్రజలకు అనేక హామీలు ఇచ్చారు, ఈ పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు ఏ విధంగా సమకూరుస్తున్నాయి అనుమానాలు రెక్కిస్తున్నాయి, ఎవరు అధికారంలోకి వచ్చినా మీ రాష్ట్ర ప్రజల పైన దేశ ప్రజల పైన అప్పు ఒక్కొక్కరి పైన రెండు లక్షల వరకు ఉంటుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు, దేశంలో రాష్ట్రంలో వనరులు సంపదను కుల్లగొట్టి చివరకు ఈ రాష్ట్ర ప్రజలను ఎందుకు పనికిరాకుండా చేయడానికి రాజకీయ పార్టీల నాయకులు ఉచిత హామీల పేరుతోనా ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వస్తున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి, వీటి పైన చేస్తున్న అప్పు పైన స్పష్టమైన హామీ ప్రజలకు ఇవ్వాలని ప్రజల పైన భారం పన్నుల భారం నిత్యవసర వస్తువులు సరుకులు ఆకుకూరలు కూరగాయలు ధరలు పెంచకుండా ఎలాంటి టాక్సీలు విధించకుండా ఈ ప్రభుత్వాలు శ్వేత పత్రాలు విడుదల చేసి ప్రజలకు గ్యారెంటీ పత్రాలను ఇవ్వాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు, ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలకు ఎలాంటి వారంటీ లేదని ప్రజలు అంటున్నారు, అందుకే షరతులు కండిషన్లు వర్తిస్తున్నాయని ప్రభుత్వం అంటుంది,ఇచ్చిన హామీల అమలు చేయలేక రైతు భరోసా పథకంలో మార్పు చేర్పులతో పాటు రెండు లక్షల రుణమాఫీ పథకంలో కూడా ప్రతి సంక్షేమ పథకంలో కూడా ప్రభుత్వం షరతులు పెట్టి ఊతలు విధించే కుట్రకు పాల్పడుతుందని ప్రజలు అంటున్నారు, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం గత టిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పును ప్రజలకు తెలియజేయాలని ఈ ప్రభుత్వం ఈ రాష్ట్రాన్ని ఏ విధంగా అప్పు లేని రాష్ట్రం లేకుండా తనిక రాష్ట్రంగా చేస్తుందో స్పష్టంగా ప్రజలకు తెలియజేయాలని ప్రజలు కోరుతున్నారు,

## కృష్ణ కుటుంబానికి రెండు లక్షల ఆర్థిక సాయం చేసిన

**బానోత్ శంకర్ నాయక్ మాజీ శాసన సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు**



మానుకోట జిల్లా (గౌతమ్ న్యూస్): మానుకోట మండలం మాదాపురం ఉమ్మడి గ్రామపంచాయతీ, తూర్పు తండ మాజీ సర్పంచ్ భర్త కృష్ణ 10వ రోజు కార్యక్రమంలో పాల్గొని వారి కుటుంబానికి మనో ధైర్యాని ఇచ్చి వారి కుటుంబ ఆర్థిక సహాయం 50 వేల రూపాయలు ఇచ్చి, వారి కుటుంబనికి ఎప్పుడు అండగా వుంటానాని భరోసా ఇచ్చారు. మహబూబాబాద్ మాజీ శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్, డాక్టర్ సీతామాలక్ష్మి. ఈ కార్యక్రమంలో నాయిని రంజిత్ 25,000 వేలు, ముత్యం వెంకన్న గౌడ్ 25,000, ఆవుల వెంకన్న 25,000, నూనవత్ అశోక్ 5,000, ముగ్గురు సర్పంచులు 15,000, తెల్ల శ్రీను 2,500, జి.విజయ్ 5,000, చంద్రారెడ్డి 5,000, సుధగాని మురళి గౌడ్ 2,500, జి.యాదగిరి 5,000 ఆర్థిక సహాయాన్ని అందించి, కృష్ణ కుటుంబానికి ఎల్లవేళలా బీఆర్ఎస్ పార్టీ, శంకర్ నాయక్ అండగా ఉంటాడు అని గుర్తుంచుకోండి. ఇంకా పరామర్శించిన రామచంద్రు బాలు నాయక్, దాము నాయక్, నవిన్, రమేష్ నాయక్, వెంకట్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.



## పలు మార్లు చెప్పినా....పట్టింపు ఏది..



బయ్యారం(గౌతమ్ న్యూస్): పలుమార్లు సిబ్బందికి సమస్యను విన్నవించినా పట్టించుకునే నాథులే కరువయ్యారని బయ్యారం మార్కెట్ యార్డ్ నందు వున్న వాటర్ ట్యాంక్ సమీపంలో ని రైతులు తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు. గత 20 రోజులు గా ట్యాంక్ రాత్రిళ్ళు నిండి తెల్లవారు వరకు నిరతరాయంగా పొంగి పొర్లుతుంది. ప్రక్కన ఉన్న రైతులు తమ పొలాలలో వడ్లు చల్లుకోవటం, నారు పోసుకోవడం చేసుకున్నారు. రోజు ట్యాంక్ వాటర్ రావడం వలన,చల్లిన వడ్లు,నారు మళ్లు మునిగి మురిగి పోతున్నాయి. తాము ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి వేసిన పంటలు నిర్ధాక్షిణంగా సిబ్బంది నిర్లక్ష్యం వలన మురిగి పోతున్నాయని , ఇప్పటికే చాలా నష్టం జరిగింది అక్కడి రైతులు తమ బాధని తెలియజేస్తున్నారు. ఈవిషయం గురించి సంబంధిత సిబ్బంది ఎన్ని మార్లు విషయం తెలిపినా వారి నిర్లక్ష్య ధోరణి మారడం లేదని, సంబంధిత అధికారులు ఈవిషయం పై తగు చర్యలు తీసుకొని తమ పంట పొలాలకు ట్యాంక్ వాటర్ రాకుండా నిలువరించాలని వారు కోరారు.



గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక
గురువారం - 11 - జూలై - 2024

## మాలోత్ వెంకన్న ఉద్యోగ సేవలు అందరికీ స్ఫూర్తిదాయకం



మానుకోట జిల్లా(గౌతమ్ న్యూస్): క్రమశిక్షణ మనిషిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది మల్లెల శ్రీనివాసరావు జైలర్ సబ్ జైలు, మహబూబాబాద్ క్రమశిక్షణ మనిషిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని మహబూబాబాద్ సబ్ జైలు జైలర్ మల్లెల శ్రీనివాసరావు అన్నారు. జైల్లో విధులు నిర్వహిస్తున్న హెడ్.వార్డర్ మాలోత్ వెంకన్న అసిస్టెంట్ డిప్యూటీ జైలర్ గా పదోన్నతి సాధించి బదిలీపై వెళ్తున్న సందర్భంగా జైలు అధికారులు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్లెల శ్రీనివాసరావు మాట్లాడుతూ వృత్తిపట్ల అంకితభావంతో సేవా నిరతి కలిగి పదోన్నతి సాధించడం గొప్ప విషయమన్నారు. తాము విధులు నిర్వహించిన సందర్భంలో ఎన్ని ఆతుపోట్లు ఎదురైనా ఉద్యోగం ధర్మాన్ని తప్పకూడదని అన్నాడు. ఉన్నత విలువలతో కూడిన ఉద్యోగం బాధ్యత ఎప్పుడూ మనిషిని ఉన్నత స్థానంలో కూర్చోపెడుతుందని అన్నారు. సమయపాలన ఉత్తమ ఉద్యోగ భాద్యతకు మొదటి మెట్టు అన్నారు. భాద్యతతో కూడిన మాలోత్ వెంకన్న ఉద్యోగ సేవలు అందరికీ స్ఫూర్తిదాయకం అని అన్నారు. అనంతరం మాలోత్ వెంకన్నకు జైలు అధికారులు శాలువా, జ్ఞాపికతో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిటిజన్ ఫోరం సభ్యులు శంతన్ రామరాజు, జైలు ఉన్నతధికారులు డిప్యూటీ జైలర్ పట్టెం బిక్షపతి, సదా నిరంజన్, హెడ్.వార్డర్ ఇఫ్తికర్ మహ్మద్, జితేంధ్రప్రసాద్, పుప్పాల రాజు, ప్రభాకర్ రెడ్డి, చీర వెంకన్న, మహ్మద్ చాంద్ పాషా, బోడ వెంకన్న, సిరిప్రసాద్, పొనుగోటి విజయ్, కడారి కుమారస్వామి, గుగులోత్ మురళి, ఇస్లావత్ దుధియా, అనిత, లక్ష్మణ్, రాజేంద్ర ప్రసాద్, మేరుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నిరసన దీక్షకు కొత్తగూడెం మున్సిపల్ కౌన్సిలర్ల సంఘీభావం

### వేలంపాటను కేంద్రం విరమించుకోవాలి.

### సిపిఐ మున్సిపల్ కౌన్సిలర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణను నిరసిస్తూ గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట చేపట్టిన నాలుగో రోజు దీక్షల శిభిరాన్ని కొత్తగూడెం మున్సిపల్ కౌన్సిలర్ల బృందం సందర్శించి సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా 8వ వార్డు కౌన్సిలర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే హక్కు కేంద్రానికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థ ఐన సింగరేణికి తెలంగాణలోని బొగ్గు నిక్షేపాలు వెలికి తీసేందుకు అనుమతివ్వాలని, ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. యావత్ సింగరేణి కార్మికులు, ప్రజలు ఏఐటీయూసీ నిర్వహిస్తున్న పోరాటాలకు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో కొల్లాపూర్ ధర్మరాజు, బోయన విజయకుమార్, భూక్య శ్రీనివాస్, నేరెళ్ల శ్రీను, అజీజ్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు గనిగల వీరస్వామి, జక్కుల గట్టయ్య, కత్తెర్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులందరికీ తక్షణమే జీవో నెంబర్ 22 అమలు చేసి అన్ని సౌకర్యాలు కల్పించాలి

### సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు రాసూరి శంకర్.




భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో కొత్తగూడెం రైటర్ బస్తి గేట్ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. సంఘం అధ్యక్షుడు రాసూరి శంకర్ కార్మికుల ఉద్దేశించి మాట్లాడుతూ సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ వెంటనే 22 జీవోను అమలు చేయాలని, ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని, ప్రతి కాంట్రాక్ట్ కార్మికుల పిల్లలకు కూడా సింగరేణి స్కూల్లో ఫ్రీ ఎడ్యుకేషన్ ఇవ్వాలని చెప్పడం జరిగింది. 22 జీవో కోసమని టీజేఎసీ ప్రొఫెసర్ కోదండరాం గారిని కలిసి వారి ఆధ్వర్యంలో సింగరేణి ఎండి ని కలిసి సమస్యలన్నీ కూడా వివరించడం, వారు కూడా సానుకూలంగా స్పందించి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ మీటింగ్ లో 22 జీవో కోసం లెటర్ పెట్టి గవర్నమెంట్ పంపుతామని హామీ ఇవ్వడం జరిగింది, దానికి సంబంధించి కొత్తగూడెం ఏరియాలో ప్రొఫెసర్ కోదండరాం గారి భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని రాసూరి శంకర్ వివరించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ గూడెల్లి యాకయ్య, భాషబోయిన రవికుమార్ రైటర్ బస్తి కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

## గుర్తుచప్పుడు లేకుండా గుట్కా య స్వాహా!



నల్లబెల్లి (గౌతమ్ న్యూస్): పొగాకు ఉత్పత్తులైన గుట్కా అంబర్ లాంటి విక్రయాలపై నిషేధం విధించినట్లు ప్రభుత్వం ప్రకటించింది అలా ప్రకటించిందో లేదో గుట్కా అంబర్ ల డీలర్ విక్రే తలు తమ వద్దనున్న సరుకులు రహస్య ప్రదేశాలకు తరలించి వేశారు వ్యసనపరులు వాటికోసం గల్లి గల్లి తిరుగుతున్నారు ఆ గుట్కాల డీలర్ విక్రతలు చిల్లర వ్యాపారులకు బ్లాకులో విక్రయిస్తుండడంతో వ్యసనపరులకు అధిక ధరలకు విక్రయించాల్సి వస్తుంది రూ.10 ఉన్న గుట్కా రూ.20 అలాగే అంబర్ ప్యాకెట్ రు.15 ఉన్న ఈ ప్యాకెట్ రూ.25 ఎక్కువ పెట్టి కొనుకుంటున్నట్లు సమాచారం అలాగే పాన్లో వాడే జర్ద కూడా పొగాకు ఉత్పత్తియే కాబట్టి దానిని రహస్యంగా ఉంచి పాన్ బిడ కట్టిస్తున్నారు ఈ క్రమంలో పొగాకు పంట సాగు కూడా నిషేధం ఉంటుందేమోనని సందేహం వ్యక్తం అవుతుంది కొన్ని ప్రాంతాల్లో రైతులు ప్రధాన సాగు అయిన పొగాకు పంట అనేక దేశాలకు సైతం ఎగుమతి అవుతుంది అలాంటిది పొగాకు ఉత్పత్తులపై నిషేధం విధించడం ఎంతవరకు సమంజసమని సవాళ్లు ఎదురయ్యే అవకాశం లేకపోలేదు గుట్కా లాంటి పొగాకు ఉత్పత్తుల కంటే యువతను పెడదోవ ప్రకటిస్తున్న డ్రగ్ మహమ్మారి ఇంకా భయంకరమైంది సంపన్నులు రేవ్ పార్టీల పేరుతో డ్రగ్స్ తీసుకుంటూ జల్సాలు చేస్తున్నారు యదేచ్ఛగా పేదోళ్ల వ్యసనంపై గురియా సంపన్నులు కాదా అని గ్రామీణ ప్రాంత గుట్కా వ్యసనపరులు ప్రశ్నిస్తున్నారు..

## కాంగ్రెస్ పాలనలోగ్రామపంచాయతీ వర్కర్లు భిక్షాటన!!



నర్సాపూర్ (గౌతమ్ న్యూస్): శివంపేట్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ వచ్చిన అప్పటి నుండి దుర్మార్గ పాలన చేస్తున్న రేవంత్ రెడ్డి దొంగ హామీలు ఇచ్చి గ్రామపంచాయతీ వర్కర్లకు జీతాలు రాక శివంపేట గ్రామంలో ఇంటింటా మరియు షాపుల వద్ద తిరుగుతూ బిక్షాటన చేశారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పెద్ద కోల అశోక్, అంతమోల్ల వసంత, సైదవ, భూమమ్మ, భాస్కర్, ఆగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని కుటుంబానికి అండగా సమ్మి గౌడ్ ఫౌండేషన్

### అనురాధ కుటుంబాన్ని పరామర్శించి 50 కేజీల బియ్యం ఆర్థిక సాయం అందజేసిన సమ్మయ్య గౌడ్

### పదవులు లేకపోయినా, పేదల కోసం పరితపించే వ్యక్తి చిలువేరు సమ్మయ్య గౌడ్

### కాంగ్రెస్ సీనియర్ నాయకులు మూల భూలోక రెడ్డి, బాలాజీ రెడ్డి



మానుకోట జిల్లా (గౌతమ్ న్యూస్): కేసముద్రం మండలం కోరుకొండ పల్లి గ్రామంలో బుధవారం జిలకర సునీత-సురేష్ ల కూతురు జిలకర అనురాధ ఇటీవల ఇంటర్ ఫెయిల్ కావడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకోవడం జరిగింది విషయం తెలుసుకున్న సమ్మి గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారి కుటుంబాన్ని పరామర్శించి అనురాధ ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించి అదేవిధంగా మృతురాలి చెల్లెలు సంధ్య సౌమ్యలకు విద్యా సామాగ్రి ఇప్పిస్తానని వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని, సమ్మి గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ 50 కేజీల బియ్యం,రూ,3000/-వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు యాసాడి బాలాజీ రెడ్డి, మూల భూలోక రెడ్డిలు మాట్లాడుతూ మన గ్రామంలో ఏ కుటుంబాలై నా సరే ఆపదలో ఉన్నారని తెలియచేస్తే చాలు వెంటనే గ్రామానికి చేరుకొని ఆ యొక్క కుటుంబాలకు వారి సహాయ సహకారాలు అందజేయడం వారి గొప్ప మనసుకు నిదర్శనమని అన్నారు. ఇలా మన గ్రామానికి ఎన్నో విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నందుకు వారికి అభినందనలు తెలియజేస్తున్నామని అన్నారు. అదేవిధంగా మాజీ సర్పంచి నాగెల్లి జ్యోతి శ్రీనివాస్, కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు సట్ల శ్రీను మాట్లాడుతూ మన గ్రామంలో సమ్మి గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందుతున్న సేవలు అంతా ఇంతా కావని ప్రతి ఒక్కరూ తన వాళ్లే అనుకొని అన్నా ఫలానా కుటుంబానికి మీ సేవలు అవసరమని తెలిపిన వెంటనే వారి వద్దకు చేరుకొని వారి నుండి సహాయాన్ని పలు రకాలుగా సమ్మి గౌడ్ ఫౌండేషన్ ద్వారా సేవలందిస్తున్నందుకు మీకు ఎంతగానో కృతజ్ఞతలమని తెలిపారు. ఈ సందర్భంగా సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ మన గ్రామంలో నాపై చూపిస్తున్న ఆధార అభిమానాలకు సంతోషిస్తూ, మీ గ్రామానికి నా సేవలు అందేలా మీరందరూ మీలో ఒక్కడిగా నన్ను కలుపుకొని మీ సహాయ సహకారాలు నా నుంచి అందించే ఈ సేవలకు ఎల్లవేళలా అందిస్తున్నందుకు ప్రతి ఒక్కరికి పేరు పేరునా రుణపడి ఉంటానని, ఇప్పటికీ ఎప్పటికీ మీకు మీ గ్రామానికి నా సహాయ సహకారాలు అందజేస్తూనే ఉంటానని ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవ సలహాదారులు సామల నరసయ్య, ఎర్రంశెట్టి అశోక్, గండి వీరేందర్, కొండేటి కళాధర్, కొత్తపల్లి చంద్రయ్య, మహంకాల, సారయ్య, మాజీ ఎంపిటిసి వనం రామ నరసయ్య, గుండెల కొమరయ్య, నాగరాజు, కొమరుమల్లు, మందుల మధు, దూడయ్య, సేతు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా అక్రమాలకు పాల్పడ్డపై చర్యలు తీసుకోని తాసిల్దార్

### పర్మిషన్ లేకుండానే ప్రహరీ గోడ ఏర్పాటు కథనానికి స్పందించిన పంచాయతీ సెక్రెటరీ.

### గౌతమ్ న్యూస్ కథనానికి స్పందన.

### కొండాపూర్ గౌతమ్ న్యూస్ జూలై 10

### అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవు.




గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక

పర్మిషన్ లేకుండానే ప్రహరీ గోడ ఏర్పాటు

(గౌతమ్ న్యూస్): పర్మిషన్ లేకుండానే ప్రహరీ గోడ ఏర్పాట్లు అనే కథనంపై బుధవారం మనసాన్పల్లి పంచాయతీ కార్యదర్శి తన పంచాయతీ పరిధి వరకు నోటీసు అందజేయడం జరిగింది. రెవెన్యూ అధికారులచేయవలసిన పని చేయకుండా నిర్లక్ష్యంగా ఉన్నారు. అగ్రికల్చర్ భూమిలో నాన్ అగ్రికల్చర్ పనులు ఆరడుగుల భారీ ప్రహరీ గోడ నిర్మాణం పై సంబంధిత మండల తాసిల్దార్ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో తెలియని పరిస్థితి. వివరణ కోసం తాసిల్దార్ కు కాల్ చేస్తే ఏంటి ఎక్కువ మాట్లాడుతున్నావ్ అని రిపోర్టర్ పై సీరియస్ అవుతున్నారు. తాసిల్దార్ కు యజమానికి భయపడి ఇలా మాట్లాడుతున్నారా? లేదా ఇంకేమైనా జరిగిందా?అనే అనుమానం నెలకొంది వార్త రాసి తాసిల్దార్ తమ వాట్సాప్ కి పంపిన చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు కావున ఇకనైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి అగ్రికల్చర్ భూమిలో అక్రమంగా నిర్వహించిన భారీ ప్రహరీ గోడను తొలగించాలని గౌతమ్ న్యూస్ మంగళవారం వార్త ప్రచురించడం జరిగింది. సంబంధిత జిల్లా కలెక్టర్, ఆర్ డి ఓ లు చర్యలు తీసుకోవాలి.

## అల్పాహార నిర్వాహకులకు అప్పుల బాధ...



నల్లబెల్లి (గౌతమ్ న్యూస్): సీఎం అల్పాహార పథకం అమలుకు ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పుచేసి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న దుస్థితి నిర్వాహకులకు నెలకొంది ఆరు నెలలుగా ప్రభుత్వం బిల్లులు గౌరవ వేతనం పెండింగ్లో పెట్టడంతో నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించి హాజరు శాతం పెంచుతామని చెప్పి సీఎం అల్పాహార పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే ఈ పథకం కింద మండలంలోని 36 ప్రభుత్వ



పాఠశాలలను ఎంపిక చేయగా ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 1386 మంది విద్యార్థులకు అల్పాహారం అందించాలని నిర్ణయించారు కాగా మొదటగా నల్లబెల్లి ,రేలకుంట, ముచింపుల, ముచింపుల తండా ,నందిగామ ప్రాథమిక పాఠశాలల తో పాటు నందిగామ హైస్కూల్లో పథకం అమలు చేపట్టారు 304 మంది విద్యార్థులు ఉదయం వేళ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం అల్పాహారం అందిస్తున్నారు. అల్పాహారం అందిస్తున్న కార్మికులకు కేవలం 1000 రూపాయలు చొప్పున గౌరవ వేతనం ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆరు నెలలు గా చెల్లించడం లేదు ఈ క్రమంలో కార్మికులు కుటుంబాలతో సహా పస్తులు ఉండాల్సిన దుస్థితి నెలకొంది కేవలం 1000 రూపాయలు ఇస్తామని ప్రకటించిన అది కూడా ఆరు నెలలుగా చెల్లించకపోవడంతో కార్మికులు మానసిక వేదనకు గురవుతున్నారు ప్రభుత్వం వెంటనే స్పందించి సత్వరమే బిల్లులు విడుదల చేయాలని వారు కోరుతున్నారు బాకీలు వేలాదిగా పెరిగిపోతుండడంతో కిరాణా షాపు వారు సరుకులు ఇవ్వడం లేదు ఇంకా ఆలస్యం చేస్తే వారు తెచ్చిన అప్పులకు ప్రభుత్వం ఇచ్చే వెయ్యి రూపాయలు వడ్డీలకే సరిపోయే ప్రమాదం ఉందని వారు వాపోతున్నారు.

## భారత భౌగోళిక పరిస్థితులపై ప్రదర్శన...!!



మహబూబాబాద్ బ్యూరో(గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అనంతారం శివారు టీజీ మోడల్ స్కూల్ పదవ తరగతి విద్యార్థులు సాంఘిక శాస్త్రంలోని అంశమైన భారత దేశ భౌగోళిక పరిస్థితులను వివరిస్తూ ప్రాజెక్టును రూపొందించారు . సిసిఈ విద్యా విధానానికి అనుగుణంగా విద్యార్థులు దేశంలోని మైదానాలు, పీఠభూములు, హిమాలయ పర్వతాలు, ఎడారులు, పంటలు పండే భూములను గుర్తించి వివరంగా తెలిసే విధంగా ప్రాజెక్టును రూపొందించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు టి. సతీష్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ ప్రాజెక్టును రూపొందించారు. వారిని ప్రిన్సిపల్ డి. అమరావతి అభినందించారు.

## షాపులో నుంచి వస్తున్న వ్యర్థ నీరువల్ల ప్రజలకు అనారోగ్యం

### అధికారు వెంటనే చర్యలు తీసుకోవాలి!



మరిపెడ(గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో సీతారాంపురం వీధిలోఓ మటన్ షాప్ లో నుచి వచ్చే వేస్టు నీళ్లు దారిలో వెళ్లే జనాలకు వాసన రావడం వల్ల అనారోగ్యము వచ్చే అవకాశాలు ఉన్నాయని వెంకన్న అన్నారు. ఇంటి ముందు నిల్వ ఉండడంతో దృవాసన వస్తుంది అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు వీధిలో దృవాసన రావడంతో ఆవేదన చెందుతున్నారు వెంటనే మునిసిపల్ కమిషనర్ వెంటనే స్పందించి షాపు యజమానితో మాట్లాడి చర్యలు తీసుకోవాలని వీధిన వెళ్లే ప్రజలు కోరుతున్నారు.

## తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ ట్రైబల్ కో- ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా బెల్లయ్య నాయక్



హనుమకొండ(గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ ట్రైబల్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ తేజావత్ బెల్లయ్య నాయక్ ను వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ చైర్మన్ గూగులోతు రవీందర్ నాయక్ కలిసి పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రవీందర్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణలో తండాలను గ్రామపంచాయతీలుగా చేయడానికి అనేక రకాలుగా ఉద్యమం చేయడంలో బెల్లయ్య నాయక్ ముందు వరుసలో నిలబడ్డారని గుర్తు చేశారు. అంతేకాకుండా తెలంగాణలో లంబాడీల ఆదివాసీల హక్కుల కొరకు అలుపెరుగని పోరాటం చేశాడని, తెలంగాణ కొరకు జరిగిన ఉద్యమంలో కూడా బెల్లయ్య నాయక్ కీలకమైన పాత్ర పోషించడంతోపాటు రాహుల్ గాంధీ భారత్ జూడో యాత్ర లో కూడా బెల్లయ్య నాయక్ పాల్గొన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని, కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలకు గాను, కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం చైర్మన్ గా నియమించినందుకు పార్టీ పెద్దలకు ఈ సందర్భంగా రవీందర్ నాయక్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## చేయ్యందుకున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అనుచరుడు



హనుమకొండ (గౌతమ్ న్యూస్): హనుమకొండ సుబేదారి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అనుచరుడు 14వ డివిజన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ ఫేస్ -1 (ముసలమ్మకుంట) కి చెందిన బండ్ల సురేందర్ బుధవారం డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, గ్రామ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ కార్యక్రమంలో 14వ డివిజన్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు పులిచేరి రామకృష్ణ, పైసా మహేష్, మరియు గ్రామ పార్టీ నాయకులు గొలుసుల సంతోష్, దశ్రు నాయక్, నరేందర్ చారి, యకంబ్రచారి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ రేంజ్ ఐజీగా చంద్రశేఖర్ రెడ్డి నియామకం



హనుమకొండ(గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో పలువురు ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో వరంగల్ రేంజ్ ఐజీగా చంద్రశేఖర్ రెడ్డి ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## నాలుగు సెల్ ఫోన్లు రికవరీ





నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): వనపర్తి మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన నలుగురు వ్యక్తులకు సంబంధించిన సెల్ ఫోన్ లు చాకచక్యంగా సి ఈ ఐ ఆర్ కోడి ద్వారా స్వాధీనం చేసుకున్నట్లు వనపర్తి రూరల్ ఎస్సై జలంధర్ రెడ్డి తెలిపారు, బుధవారం స్వాధీనం చేసుకున్న సెల్ఫోన్లను బాధితులు మన్యపు మన్యం, బై రోజు వెంకటయ్య, గొర్ల రాధాకృష్ణ, శివ అనే వ్యక్తులకు అందజేసినట్లు ఆయన తెలిపారు, ఈ మధ్యకాలంలో సెల్ఫోన్ దొంగతనాలు ఎక్కువ జరుగుతున్నాయని ప్రతి ఒక్కరు తమ తమ సెల్ ఫోన్లు , లాప్టాప్ లు తగు జాగ్రత్తగా ఉంచుకోవాలని ఎస్ఐ కోరారు, ఈ సందర్భంగా దోపిడికి గురైన సెల్ఫోన్లను స్వాధీనం చేసిన ఎస్సై జలంధర్ రెడ్డి కి బాధితులు అభినందనలు తెలిపారు,

## నర్సంపేట ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు దుర్గేష్ గౌడ్ ఐడి కార్డు పంపిణీ చేశారు

### ప్రతి ఒక్క ఫోటోగ్రాఫర్ అభివృద్ధి చెందాలని దుర్గేష్ గౌడ్ చిరకాల కోరిక



నర్సంపేట (గౌతమ్ న్యూస్): ఈరోజు బుధవారం సాయంత్రం 6 గంటలకు నర్సంపేట మండల ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దుర్గేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఫోటోగ్రాఫర్ ఐడి కార్డు ఆవిష్కరించడం జరిగింది అలాగే ప్రతి ఒక్క ఫోటోగ్రాఫర్ వృత్తిని ఎంచుకున్న ప్రతి ఒక్క ఫోటోగ్రాఫర్ ని నా రెండు కళ్ళల్లో పెట్టుకుని చూసుకుంటా అందరూ బాగుండాలని తన కోరిక ఎవరికీ ఏ కష్టం ఉన్నాగాని మీ ముందు నేనుంటా .మండలంలో ప్రతి ఫోటోగ్రాఫర్ తమ తమ ఐడి కార్డు స్వీకరించాలని అధ్యక్షులు అన్నారు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నవారు తక్కళ్ళపెల్లి సోమేశ్వర్ గారు, కాసాల శ్రీనివాస్ రెడ్డి, కుసుమ శంకర్ గారు, బేతి కన్నయ్య, తాటికొండ శివ, బానోతు వెంకట్ గిన్నారపు అనిల్, ఆకుల రాజు,లింగాల వేణు రెడ్డి, ఆకారపు మోహన్ లు పాల్గొన్నారు



## శ్రీ పరివార్ ఆధ్వర్యంలో 21 రోజుల యోగ సాధన శిఖరం ఉచిత పరిచయ కార్యక్రమం

### ఆచార్య డిగ్రీ కాలేజీ అంబేద్కర్ సెంటర్ నర్సంపేటలో



నర్సంపేట (గౌతమ్ న్యూస్): తేదీ 24/07 /2024 నుండి యోగా క్లాస్ ప్రారంభం అవుతుంది.. ఈ క్లాసులో శారీరక మానసిక ఆరోగ్యాలను మెరుగుపరచుకొని ఆధ్యాత్మికంగా, ఆర్థికంగా మానసికంగా శారీరకంగా మరియు సామాజికపరంగా ఏ రంగంలో చూసిన ఈ శిబిరం ద్వారా స్వాంతన చేకూర్చుకోవచ్చు. ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు సదానందం బాపూజీ యోగాచార్యులు 9603233670 దివ్యశ్రీ ఫోటో స్టూడియో ద్వారకాపేట్ రోడ్ నర్సంపేట్ 98480 88914 జై గురుదేవ్



## ఏటీఎం మెషిన్ ఎత్తుకెళ్లిన అంతర్ రాష్ట్ర దొంగల ముఠా

కామారెడ్డి జిల్లా (గౌతమ్ న్యూస్): ఏటీఎంలోకి చొరబడ్డ దుండగులు.. ఏకంగా ఏటీఎం మిషిన్‌ను ఎత్తుకెళ్లిన ఘటన కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఏటీఎంలో రూ. 3.95 లక్షల నగదు ఉన్నట్టు సమాచా రం. ఘటనా స్థలాన్ని బాన్సువాడ డీఎస్పీ సత్యనా రాయణ, సీఐ నరేష్ పరిశీలించారు. మూడు గంటల ప్రాంతంలో వచ్చిన దుండుగులు.. కేవలం మూడు నిమిషా ల్లోనే ఏటీఎంను ఎత్తుకెళ్లి నట్టు సమాచారం. ఎస్ఐ మోమన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ వారం తెల్లవారు జామున 3 గంటలా 20 నిమిషాల సమయంలో దొంగలు చాకచక్యంగా ఏటీఎంలోకి చొరబడి డబ్బులతో సహా ఏటీఎం మెషిన్‌ను ఎత్తుకెళ్లారు. ఏటీఎంలో రూ. 3 లక్షలా 95 వేలు ఉన్నాయని, ఏటీఎంతో సహా దొంగలు ఎత్తుకెళ్లినట్టు బ్రాంచ్ చీఫ్ మేనేజర్ మోహన్‌రావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. ప్రధాన కూడలిలో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల రికార్డులను పరిశీలించగా..ఏటీఎం ఎత్తుకెళ్లిన దొంగలు మహారాష్ట్ర వైపు వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. త్వరలోనే దుండగులను పట్టుకుంటామని తెలిపారు. ఏటీ ఎంను ధ్వంసం చేసి నగదు ఎత్తుకెళ్లిన ఘటనలు చూశాం కానీ.. ఏకంగా మిషిన్‌ను ఎత్తుకెళ్లిన ఘటన ఇంతవరకు చూడలేదని స్థానికులు పేర్కొంటున్నారు...

## మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ను సన్మానించిన మోకుదెబ్బ నాయకులు



నర్సంపేట, (గౌతమ్ న్యూస్): నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమితులైన పాలాయి శ్రీనివాస్ ను బుధవారం నర్సంపేటలో మోకుదెబ్బ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమం లో మోకుదెబ్బ నాయకులు అనంతుల రమేష్ గౌడ్, గోడిశాల సదానందం గౌడ్,గంప రాజేశ్వర్ గౌడ్,మాచర్ల ఐలుమల్లు గౌడ్, గోపగాని వెంకటేష్ గౌడ్, రామగోని సుధాకర్ గౌడ్,శీలం వీరన్న గౌడ్, బుడిగే మల్లేశం గౌడ్, ముంజాల రాజేందర్ గౌడ్, జూలూరి హరిప్రసాద్ గౌడ్, మర్ద గణేష్ గౌడ్, జనగాం మల్లేశం గౌడ్,మేరుగు గంగాధర్ గౌడ్,ముంజాల సంజీవ్ గౌడ్,గోడిశాల మల్లికార్జున్ గౌడ్,, గంధసిరి సాంబారావు గౌడ్, ఊడ్గుల సునిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్ ట్రైబల్ కో-ఆపరేటివ్ ఫైనాన్షియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ట్రైకార్ )చైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన డాక్టర్ తేజవత్. బెల్లయ్య నాయక్

హైదరాబాద్ (గౌతమ్ న్యూస్): హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ మాసబ్ ట్యాంక్ ట్రైబల్ భవన్ లో ఉదయం 11 గంటలకు 25 నిమిషాలకు షెడ్యూల్ట్రైబల్ కో-ఆపరేటివ్ ఫైనాన్షియల్ డెవలప్మెంట్









కార్పొరేషన్ లిమిటెడ్ (ట్రైకార్ )చైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బెల్లయ్య నాయక్ తేజావత్, ఈ కార్యక్రమానికి పౌరసరఫరాల





శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, ప్రభుత్వ డాక్టర్ రామచంద్రనాయక్, ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ , మాజీ ఎమ్మెల్యే , ఫారెస్ట్ కార్పొరేషన్ చైర్మన్ పోదాం వీరయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అద్దంకి దయాకర్ హాజరై నారు వారి సమక్షంలో పూజా కార్యక్రమం అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు. ట్రైబల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శరత్ నాయక్ , ఐఏఎస్, ట్రై కార్ జిఎం శంకర్ రావు, డీజీఎం లక్ష్మీప్రసాద్ ట్రైకార్ ఉద్యోగులు వివిధ గిరిజన సంఘాల నేతలు గిరిజన ఉద్యోగ సంఘాల నేతలు బంధువులు మిత్రులు పెద్ద ఎత్తున పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఏజెన్సీ గీత కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలి

### మోకుదెబ్బ రాష్ట్ర నాయకులు రమేష్ గౌడ్ డిమాండ్

ఖానాపురం (గౌతమ్ న్యూస్): వరంగల్ జిల్లా ఖానా పురం మండలం మంగళవారిపేట గ్రామానికి చెందిన తాళ్లపెల్లి పెద్ద కమలాకర్ గౌడ్ అనే గీత కార్మికుడు కొద్ది రోజుల క్రితం తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. విషయం తెలిసిన గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ తెలంగాణా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ తో పాటు మోకుదెబ్బ నాయకులు కమలాకర్ గౌడ్ ను బుధ వారం పరామర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ మాట్లాడుతూ ఏజెన్సీ గీత కార్మికులకు ఆబకారి శాఖ గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడంతో ప్రభుత్వం నుంచి ఎక్స్ గ్రేషియా, పింఛన్, బీసీ కార్పొరేషన్, ఇతర సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారన్నారు.తెలంగాణా రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రతి పక్షం లో ఉన్నప్పుడు ఏజెన్సీ గీత కార్మికుల గురించి మాట్లాడటం జరిగిందన్నారు. అధికారం లోకి వచ్చాక రాబోయే అసెంబ్లీ సమావేశంలో నైనా ఏజెన్సీ గీత కార్మికులకు న్యాయం చేయాలని రమేష్ గౌడ్ గుర్తు చేశారు. కమలాకర్ గౌడ్ కు ఎక్సైజ్ శాఖ , బీసీ. కార్పొరేషన్ నుండి ఎక్స్ గ్రేషియా, హాస్పిటల్ ఖర్చుల కొరకు దరఖాస్తు చేయడం జరుగుతుందన్నారు. గత ఆరు నెలలుగా గాయపడిన, చనిపోయిన గీత కార్మికులకు పెండింగ్ ఎక్స్ గ్రేషియా, హాస్పిటల్ ఖర్చులు చెల్లించడం లేదన్నారు. ఇప్పటికైన తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం కల్లు గీత కార్పొరేషన్ కు చైర్మన్ ను నియమించాలని, కార్పొరేషన్ కు 500 కోట్లు నిధులు కేటాయించాలని



రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. కమలాకర్ గౌడ్ ను పరా మర్శించిన వారిలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి గోడిశాల సదానందం గౌడ్,రాష్ట్ర నాయకులు శీలం వీరన్న గౌడ్,వరంగల్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు గోపగాని వెంకట్ గౌడ్, ముంజాల రాజేందర్ గౌడ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి బుడిగే మల్లేశం గౌడ్, మండలం అధ్యక్షులు మేరుగు గంగాధర్ గౌడ్, మండల నాయకులుమక్కా పెద్ద వెంకన్న గౌడ్ ,ముంజాల సంజీవ్ గౌడ్,మక్కా లింగన్నగౌడ్ ,గంధసిరి సాంబరావు తదితరులు ఉన్నారు.

## తెలంగాణ డీజీపీగా జితేందర్: ఉత్తర్వులు జారీ



హైదరాబాద్(గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి జితేందర్ ఈరోజు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం డీజీపీగా ఉన్న రవి గుప్తాను హెూంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో తెలిపింది.

## జగిత్యాల జిల్లాలో ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్ల ఆందోళన

### ఆర్టీసీ రిక్రూట్మెంట్ లో 50 శాతం అవకాశం కల్పించాలంటూ డిమాండ్

జగిత్యాల (గౌతమ్ న్యూస్): అద్దె బస్సు డ్రైవర్లకు ఆర్టీసీ రిక్రూట్మెంట్ లో 50% అవకాశం కల్పించాలని కోరుట్ల బస్టాండ్ ఎదుట డ్రైవర్లు ఈరోజు ఆందోళన చేపట్టారు. బుధవారం జగిత్యాల జిల్లా కోరుట్ల డిపోకు చెందిన అద్దె బస్సుల డ్రైవర్లు ఈరోజు ధర్నా నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగాల్లో అద్దె బస్సు డ్రైవర్లకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఎప్పటికైనా మమ్మల్ని ఆర్టీసీలో విలీనం చేస్తారని నమ్మకం తో ఇప్పటివరకు ఉద్యోగాలు కొనసాగించా మని,ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం జాబ్ నోటిఫికేషన్ ఇచ్చిన నేపథ్యంలో ఇప్పటి వరకు ఆర్.టి.సి అద్దె బస్సుల పైన ఆధారపడి ఆర్టీసీ సంస్థలో డ్రైవర్లుగా పనిచేస్తున్న మాకు ఆర్టీసీ ఉద్యోగాల్లో మొదటి ప్రాధా న్యత ఇవ్వాలని ప్రభుత్వా న్ని కోరారు. కరోనా కష్టకాలంలో కూడా మా ప్రాణాలు లెక్క చేయ కుండా ఆర్టీసీ బస్సులు నడిపిస్తూ ప్రజలను గమ్యస్థానాలకు చేర్చడంలో మా ప్రైవేట్ డ్రైవర్లు కీలక పాత్ర పోషించమన్నారు. 15 ఏండ్లకు పైగా అద్దె బస్సుల్లో చాలీచాలని జీతాలతో డ్రైవర్ గా పని చేస్తున్న మాకు ప్రభుత్వం ఇచ్చిన రిక్రూట్మెంట్ లో మొదటి ప్రాధాన్యత కల్పించాలని వారు కోరారు.. అద్దె బస్సు డ్రైవర్లను పర్మనెంట్ చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణలో 15 మంది ఐపీఎస్ అధికారుల బదిలీలు




హైదరాబాద్ ,(గౌతమ్ న్యూస్): తెలంగాణలో భారీగా ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర బుధవారం సాయంత్రం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ గా మహేష్ భగవత్.. హెూంగార్డ్స్ అడిషనల్ డీజీగా స్వాతి లక్రా..టీజీఎస్ పీ బెటాలియన్ అడిషనల్ డీజీగా సంజయ్ కుమార్ జైన్.. గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీగా స్టీఫెన్ రవీంద్ర.. రాచకొండ కమిషనర్ గా సుధీర్ బాబు.. ఏసీబీ డైరెక్టర్ గా తరుణ్ జోషి.. మల్టీ జోన్ 1 ఐజి చంద్రశేఖర్ రెడ్డి.. రైల్వే, రోడ్ సేఫ్టీ ఐజీ గా రమేష్ నాయుడు.. మల్టీ మల్టీజోన్ 2ఐజీ గా సత్యనారాయణ.. హైదరాబాద్ సిఆర్ హెడ్ కోటర్ డిసిపిగా రక్షితమూర్తి తో పాటు... మెదక్ ఎస్పీగా డి. ఉదయ్ కుమార్ రెడ్డి.. వనపర్తి ఎస్పీగా గిరిధర్.. ఈస్ట్ జోన్ డీసీపీగా బాలస్వామి.. సౌత్ వెస్ట్ జోన్ డీసీపీగా చంద్రమోహన్, బదిల య్యారు.

## లక్షలాది మోసపూరిత ఖాతాలు




న్యూఢిల్లీ : బ్యాంక్‌లు, బ్యాంకింగేతర విత్త సంస్థల్లో ఇటీవల లక్షలాది మోసపూరిత ఖాతాలు పెరిగిపోతున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ జె అన్నారు. మోసపూరిత లావాదేవీలు, ఎవర్‌గ్రీనింగ్ రుణాల కోసం ఉపయోగించే బ్యాంకు ఖాతాలు ఇటీవల పెరిగాయన్నారు. కొన్ని బ్యాంకులు ఇలాంటి లక్షలాది ఖాతాలను కలిగి ఉండటం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. రుణగ్రహీత చెల్లించిన ప్రిన్సిపల్ మొత్తంను మళ్లీమళ్లీ రుణ రూపంలో ఖాతాదారులకు ఇవ్వడాన్ని ఎవర్‌గ్రీనింగ్ రుణాలుగా భావిస్తారు. మంగళవారం బ్యాంకుల చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్లు, ఆడిటర్లతో జరిగిన సమావేశంలో స్వామినాథన్ మాట్లాడుతూ.. అంతర్గత ఖాతాల నియంత్రణ, నిర్వహణలో లోపాలు ఉన్నాయని విత్త సంస్థలను ఉద్దేశించి అన్నారు. కొన్ని బ్యాంకులకు సరైన కారణం లేకుండా లక్షలాది ఖాతాలు కలిగి ఉండటాన్ని తాము గుర్తించామన్నారు. గత వారం బ్యాంక్ ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలోనూ మోసపూరిత ఖాతాలపై ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ మోసాలను అరికట్టాలని సూచించారు. ఈ ఖాతాల్లో కొన్ని మోసపూరిత లావాదేవీలు, రుణాల ఎవర్ గ్రీన్ కోసం వినియోగిస్తున్నట్లు స్వామినాథన్ తెలిపారు. ఈ ఖాతాలతో దుర్వినియోగానికి అవకాశం ఉన్నందున వాటిని హేతుబద్ధీకరించాలని సూచించారు. వీలైనంత వరకు తగ్గించాలన్నారు. సంస్థల ఆర్థిక సమగ్రతను, పారదర్శకతను కాపాడుకోవడంలో సిఎఫ్‌ఒలు కీలక పాత్రను పోశించాలన్నారు. పలు బ్యాంకుల్లో సరైన కారణం లేకుండా కొనసాగిస్తున్న లక్షలాది ఖాతాలు కొన్ని మోసపూరిత లావాదేవీలకు మద్దతును ఇస్తున్నాయన్నారు. విత్త సంస్థల్లో పారదర్శకత పెంచడానికి ఆడిటర్లు, సిఎఫ్‌ఒలు నిజాయితీతో వ్యవహరించాలని మరో డిప్యూటీ గవర్నర్ ఎం రాజేశ్వర్ రావు సూచించారు. ఎన్‌బిఎఫ్‌సిలలో మార్గదర్శకాల అమలు లోపించిందన్నారు.

## ఆర్టీసీ క్రాస్ రోడ్డులో భారీ అగ్ని ప్రమాదం



హైదరాబాద్: నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్డులో బుధవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. శ్రీదత్తసాయి కాంప్లెక్స్‌లోని మూడో అంతస్తులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. మంటల ధాటికి కాంప్లెక్స్ అద్దాలు పగిలి రోడ్డుపై పడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశాయి. సమీపంలోని దుకాణాలు, ఆస్పత్రికి వ్యాపించే అవకాశం ఉండటంతో వాటిలోని ప్రజలు, రోగులను ఖాళీ చేయించారు. ఆ మార్గంలో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఎవరికీ ఎలాంటి హాని కలగకపోయినప్పటికీ.. భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి కమ్మరి కృష్ణ దారుణ హత్య హైదరాబాద్ నగర శివారులో దారుణ ఘటన చోటు చేసుకుంది. బడా రియల్ ఎస్టేట్ వ్యాపారిగా గుర్తింపు పొందిన కమ్మరి కృష్ణ హత్యకు గురయ్యారు. షాద్‌నగర్‌లోని తన ఫాంహౌస్ నుంచి బయటకు వస్తున్న సమయంలో కొందరు దుండగులు కత్తులతో దాడి చేశారు. కిరాతకంగా కృష్ణను కత్తులతో నరికి చంపారు. ఆ తర్వాత నిందితులు అక్కడ్నుంచి పరారయ్యారు.

## ఆర్థికమంత్రి డీప్ ఫేక్ వీడియో కలకలం.. ఎఫ్ఐఆర్ నమోదు



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ డీప్ ఫేక్ వీడియోను షేర్ చేసినందుకు చిరాగ్ పటేల్ అనే వ్యక్తిపై గుజరాత్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ మేరకు గుజరాత్ మంత్రి హర్ష్ సంఘవి తెలిపారు. కేంద్రమంత్రిపై ఉద్దేశపూర్వకంగా డీప్‌ఫేక్ వీడియో చేసినట్లుగా హర్ష్ సంఘవి పేర్కొన్నారు. పౌరులను తప్పుదారి పట్టించేందుకు డీప్‌ఫేక్‌లను వ్యాప్తి చేసే ఈ మోసపూరిత చర్య అసహ్యకరమైనదని సంఘవి అన్నారు. జీఎస్టీకి సంబంధించిన పన్నుల విషయం కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడినట్లుగా ఉన్న నకిలీ వీడియోలను చిరాగ్ పటేల్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ వీడియో కాస్త నెట్టింట వైరల్‌గా మారింది. దీంతో గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిద్దుబాటు చర్యలు చేపట్టింది. నకిలీ వీడియో అంటూ రాష్ట్ర మంత్రి కొట్టిపారేశారు. ఇదిలా ఉంటే ఈనెల 22 నుంచి పార్లమెంట్ సమావేశాలు ఉన్నాయి. ఇక ఈనెల 23న లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్ కూర్పులపై కేంద్రం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఇలాంటి సమయంలో నిర్మలా సీతారామన్ డీప్‌ఫేక్ వీడియో కలకలం సృష్టించడంతో గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది.

## బంగారం అక్రమ రవాణా.. 108 కిలోల గోల్డ్ స్వాధీనం



భారత్–చైనా సరిహద్దులో భారీగా బంగారం పట్టుబడింది. ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీసులు ఇండో–చైనా సరిహద్దు సమీపంలో కిలోగ్రాము బరువున్న 108 బంగారు కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేసినట్లు సరిహద్దు రక్షణ దళానికి చెందిన అధికారి ఒకరు తెలిపారు. భారీ మొత్తంలో స్మగ్లింగ్ చేసిన బంగారంతో పాటు, రెండు మొబైల్ ఫోన్లు, ఒక బైనాక్యులర్, రెండు కత్తులు, కేకులు, పాలు వంటి పలు చైనీస్ ఆహార పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారి వెల్లడించారు. 21వ బెటాలియన్ దళాలు మంగళవారం మధ్యాహ్నం తూర్పు లడఖ్‌లోని చాంగ్‌తాంగ్ సబ్ సెక్టార్‌లో చిజ్‌బులే, నార్బులా, జాంగిల్, జక్లాతో సహా స్మగ్లర్ల చొరబాట్లను తనిఖీ చేయడానికి లాంగ్ రేంజ్ గస్తీని ప్రారంభించినట్లు అధికారి తెలిపారు. వాస్తవ నియంత్రణ రేఖకు ఒక కిలోమీటరు దూరంలో ఉన్న శ్రీరాప్‌లో స్మగ్లింగ్‌కు సంబంధించిన ఇన్‌పుట్‌లు ఐటీబీపీకి అందాయన్నారు. అనంతరం డిప్యూటీ కమాండెంట్ దీపక్ భట్ నేతృత్వంలోని పెట్రోలింగ్ నిర్వహించగా.. ఇద్దరు వ్యక్తులు మ్యూల్స్‌పై ఉండటాన్ని గమనించి తనిఖీ చేయగా గోల్డ్ బయటపడినట్లు పేర్కొన్నారు. అయితే వారు తప్పించుకోవడానికి ప్రయత్నించగా.. వెంబడించి అరెస్టు చేసినట్లు అధికారి స్పష్టం చేశారు. మొదట వారు ఔషధ మొక్కల డీలర్లుగా పనిచేస్తున్నట్లు చెప్పినట్లు అధికారి పేర్కొన్నారు. వారి వస్తువులను సోదా చేయగా భారీ మొత్తంలో బంగారం, ఇతర వస్తువులు దొరికాయని వెల్లడించారు. ఐటీబీపీ చరిత్రలో ఇంత మొత్తంలో బంగారం దొరకడం ఇదే తొలిసారి అని.. స్వాధీనం చేసుకున్న మెటీరియల్‌ను కస్టమ్స్ విభాగానికి అప్పగిస్తామని అధికారి తెలిపారు.

## తెలంగాణ నూతన డీజీపీగా జితేందర్ నియామకం



తెలంగాణ నూతన డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి జితేందర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం డీజీపీ రవిగుప్తాను హోమ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా బదిలీ చేసింది. పంజాబ్‌కు చెందిన జితేందర్ 1992 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి జితేందర్.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి డీజీపీ అయ్యారు. తెలంగాణ డీజీపీగా నియమితులైన సందర్భంగా సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సీనియర్ ఐపీఎస్ అధికారి జితేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. పంజాబ్‌లోని జలంధర్‌లో సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన జితేందర్ ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు ఎంపికయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్మల్ ఏఎస్పీగా పనిచేసిన తర్వాత బెల్లంపల్లి అదనపు ఎస్పీగా విధులు నిర్వర్తించారు. నక్సల్స్ ప్రభావం ఎక్కువగా ఉన్న మహబూబ్ నగర్, గుంటూరు జిల్లాలకు ఎస్పీగా పనిచేశారు. ఢిల్లీలో సీబీఐలో కొంత కాలం పనిచేశారు. 2004–06 మధ్య గ్రేహౌండ్స్ బాధ్యతలుచేపట్టారు. విశాఖపట్నం రేంజ్ డీఐజీగా బాధ్యతలు నిర్వర్తించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో వరంగల్ రేంజ్ డీఐజీగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్నారు. అలాగే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన 2025 సెప్టెంబరులో పదవీ విరమణ చేస్తారు. తాజా నియామకంతో 14 నెలలపాటు డీజీపీగా జితేందర్ కొనసాగనున్నారు.

## "గాజా సిటీని వెంటనే ఖాళీ చేయాలి"..
## భారీ దాడికి సిద్ధమైన ఇజ్రాయిల్..



ఇజ్రాయిల్–హమాస్ పోరు రోజురోజుకు తీవ్రమవుతోంది. అక్టోబర్ 7 నాటి హమాస్ దాడికి ప్రతీకారంగా హమాస్ మిలిటెంట్ సంస్థను పూర్తిగా నేలకూల్చే వరకు ఇజ్రాయిల్ విశ్రమించేలా కనిపించడం లేదు. ఇప్పటికే ఈ యుద్ధం ద్వారా లక్షల సంఖ్యలో ప్రజలు ప్రభావితమయ్యారు. 30 వేలకు పైగా పాలస్తీనియన్లు చనిపోయారు. అక్టోబర్ 7 నాటి దాడిలో 1200 మందిని హతమార్చిన హమాస్ మిలిటెంట్లు, 251మందిని బందీలుగా గాజలోకి పట్టుకెళ్లారు. అప్పటి నుంచి బందీలను రక్షించేందుకు ఇజ్రాయిల్ మిలిటరీ ఆపరేషన్స్ చేస్తూనే ఉంది. తాజాగా గాజా స్ట్రిప్‌లో ప్రధాన నగరమైన గాజా సిటీ నుంచి ప్రజలు వెళ్లిపోవాలని ఇజ్రాయిల్ సైన్యం బుధవారం వేల కరపత్రాలను సిటీపై విసిరేసింది. గాజాలో ఉన్న ప్రతీ ఒక్కరు నగరం నుంచి దక్షిణాన ఉన్న సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, హమాస్ లక్ష్యాలను సైన్యం టార్గెట్ చేయడంతో ఈ ప్రాంతం ప్రమాదకరమైన పోరాట ప్రాంతంగా మిగిలిపోతుందని కరపత్రాల్లో హెచ్చరించింది. జూన్ 27న ఇజ్రాయిల్ ప్రజలను తరలించాలని ఉత్తర్వులు జారీ చేసింది, ఆ తర్వాతి రోజుల్లో మరో రెండుసార్లు నగరాన్ని విడిచిపెట్టాలని ఆదేశించింది. గాజా నగరం నుంచి దీర్ అల్–బలాహ్ మరియు అల్–జావియాలోని శిబిరాలకు రెండు సురక్షిత మార్గాల ద్వారా తనిఖీలు లేకుండా ప్రజలు చేరుకోవచ్చని తెలిపింది. ఇజ్రాయిల్–హమాస్ మధ్య గాజా యుద్ధం తీవ్ర మారణహోమాన్ని మిగులుస్తోంది. ఇప్పటికే గాజా నగరం దాదాపుగా నాశనమైంది. అక్టోబర్ 7న హమాస్ దాడి తర్వాత 251 మంది బందీలుగా హమాస్ పట్టుకుంది. వీరిలో ఇప్పటికీ 116 మంది గాజాలో ఉన్నారు. ఇందులో 42 మంది చనిపోయినట్లు మిలిటరీ తెలిపింది. ఇజ్రాయిల్ దాడిలో గాజాలో కనీసం 38,243 మంది మరణించారు.

# భారత్–రష్యా సాన్నిహిత్యం



దౌత్య ప్రపంచంలో ఏదీ యాదృచ్ఛికంగా జరగదు. పర్యటనలైనా, ప్రసంగాలైనా, సమావేశాలైనా, ఒప్పందాలైనా– దేశాల ప్రయోజనాలతో ముడిపడివుంటాయి. సమయం, సందర్భం తప్పనిసరిగా ఉంటాయి. తమ ఆలోచనలేమిటో నిక్కచ్చిగా చెప్పడం కూడా వీటి ఉద్దేశం కావొచ్చు. ప్రధాని మోదీ మూడోసారి అధికార పగ్గాలు చేపట్టాక తన తొలి విదేశీ పర్యటన కోసం ఇరుగు పొరుగు దేశాలను సందర్శించే ఆనవాయితీని పక్కనబెట్టి రష్యాను ఎంచుకున్నారు. రెండు రోజుల ఆ పర్యటన మంగళ వారం ముగియబోతుండగా అమెరికా ప్రాపకంతో 75 ఏళ్ల క్రితం ఆవిర్భవించిన సైనిక కూటమి నాటో వజ్రోత్సవాలు వాషింగ్టన్‌లో మొదలయ్యాయి. ఇవి మూడురోజులపాటు సాగుతాయి. రష్యా పూర్వరూపమైన సోవియెట్ యూనియన్‌కు వ్యతిరేకంగా నాటో ప్రారంభమైంది. కనుక మోదీ రష్యా పర్యటన సహజంగానే అమెరికాకు కంటగింపుగా ఉండొచ్చు. ఈ పర్యటన 'శాంతి ప్రయత్నాలకు' తీవ్ర విఘాతం కలిగిస్తుందని ఇప్పటికే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. పైగా అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాధినేత అత్యంత క్రూరుడైన నేరగాణ్ణి హత్తుకోవటం ఏమిటని విమర్శించారు. జెలెన్‌స్కీ చెబుతున్న శాంతి ప్రయత్నాలేమిటో ప్రపంచంలో ఎవరికీ తెలియదు. తెలిసిందల్లా రష్యాను ఎదుర్కొనటానికి యుద్ధం మొదలైననాటి నుంచీ ఉక్రెయిన్‌కు అమెరికా, పాశ్చాత్య దేశాలు ఎడాపెడా ఆయుధాలు, డబ్బు సరఫరా చేయటం. అందువల్లే ఆ ఘర్షణ ఎడతెగకుండా సాగుతోంది. ఇందులో శాంతి ప్రసక్తి ఎక్కడుందో అర్థంకాదు. రష్యా సాగిస్తున్న దురాక్రమణ యుద్ధాన్ని ఖండించాల్సిందే. కానీ ఇందులో ఉక్రెయిన్ బాధ్యత కూడా ఉంది. దాని సంగతలావుంచితే భారత–రష్యా 22వ వార్షిక శిఖరాగ్ర సమావేశం కోసం ప్రధానంగా మోదీ రష్యా వెళ్లారు. ఈ సందర్భంగా వివిధ ఒప్పందాలు కూడా కుదిరాయి. రష్యా అధ్యక్షుడు పుతిన్, మోదీకి తమ అత్యున్నత పౌర పురస్కారాన్ని కూడా అందజేశారు. అయితే మంగళవారం ఉక్రెయిన్ రాజధాని కియూవ్‌లో ఒక ఆసుపత్రిపై జరిగిన క్షిపణి దాడిలో 37 మంది చనిపోయిన ఉదంతాన్ని ఖండించటానికి మోదీ వెనకాడలేదు. రష్యాతో మనకున్న మైత్రి ఈనాటిది కాదు. ఆ మైత్రికి ఏడు దశాబ్దాల చరిత్ర ఉంది. మోదీ అన్నట్టు రష్యా అన్ని కాలాల్లోనూ దృఢంగా మన వెనక నిలబడింది. స్నేహ హస్తం అందించింది. 1971లో పాకిస్తాన్‌తో మనకు యుద్ధం వచ్చినప్పుడు అన్నివిధాలా ఆదుకుంది. ఆ యుద్ధంలో మనం సాధించిన విజయంలో సోవియెట్ పాత్ర కీలకమైనది. మన అమ్ములపొదిలో ఉన్న రక్షణ పరికరాల్లో అత్యధిక భాగం ఆ దేశం నుంచి దిగుమతి చేసుకున్నవే. ఇది కేవలం కొనుగోలుదారు–అమ్మకందారు సంబంధం కాదు. పరిశోధన, అభివృద్ధితో మొదలెట్టి ఉమ్మడి ఉత్పత్తుల వరకూ ఇరు దేశాలూ సహకరించుకుంటున్నాయి. మనకున్న రెండు విమానవాహక నౌకల్లో ఒకటి రష్యానుంచి వచ్చినదే. ఇంకా ఎస్–400 గగనతల రక్షణ క్షిపణి వ్యవస్థ, మిగ్–29, ఎస్‌యూ–30 ఎంకెఐ యుద్ధ విమానాలు, సైనిక హెలికాప్టర్లు, ఏకే–203 రైఫిళ్లు, బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణులు తదితరాలున్నాయి. ఇవిగాక తన టీ–90 శతఘ్నుల ఉత్పత్తికి మనకు అనుమతులిచ్చింది. విడి భాగాల దగ్గర్నుంచి నూతన పరిశోధనల వరకూ మన రక్షణ వ్యవస్థ పూర్తిగా రష్యాతో ముడిపడివుంది. అణు విద్యుత్ కర్మాగారాల స్థాపన, నిర్వహణలో తోడ్పడుతోంది. ఇరవై అయిదేళ్ల క్రితం మనకు అమెరికాతో కూడా సత్సంబంధాలు ఏర్పడ్డాయి. అమెరికా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ తదితర దేశాల నుంచి కూడా మనం రక్షణ పరికరాలు కొనుగోలు చేస్తున్నాం. మనను రష్యాకు దూరం చేయాలని ఆది నుంచీ అమెరికా ప్రయత్నిస్తోంది. ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యాకైతే ఇది మరింతగా పెరిగింది. ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి వంటి అంతర్జాతీయ సంస్థల్ని బేఖాతరుచేసి ఘర్షణలు నివారించే పేరుమీద అమెరికా ఒక పక్షాన్ని సమర్థించటం, అవతలిపక్షంతో ఎవరూ సాన్నిహిత్యం నెరపకూడదని ఫర్మానా జారీచేయటం ఆశ్చర్యకరం. వాస్తవా ధీన రేఖ వద్ద చైనాతో మనకు అయిదేళ్లుగా లడాయి నడుస్తోంది. ఆ దేశంతో ఘర్షణలు వస్తే మనకు రష్యా నుంచి రక్షణ పరికరాలు, విడిభాగాలు అత్యవసరమవుతాయి. అంతేకాదు... రక్షణ సాంకేతి కతలు చైనాకు పోకుండా చూడటం మనకు ముఖ్యం. ఇలాంటి పరిస్థితుల్లో అన్ని ప్రయోజనాలూ వదులుకుని తాను చెప్పినట్టల్లా నడుచుకోవాలని అమెరికా భావించటం ఎంతమాత్రం సరికాదు. పాకిస్తాన్‌తో మనకున్న సమస్యల విషయంలో ఏనాడూ అమెరికా సానుభూతిగా లేదు. కంటితుడుపు చర్యలు తీసుకోవటం, ఏదో వంకన ఆ దేశానికి సైనిక, ఆర్థిక సాయం అందించటం అమెరికాకు రివాజుగా మారింది. మనం మాత్రం తన ఫర్మానాలు పాటించాలని ఆ దేశం ఆశిస్తుంది. ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యాక రష్యా నుంచి ముడి చమురు దిగుమతి వద్దన్న అమెరికా ఒత్తిడిని కాదని, రోజుకు 21 లక్షల బ్యారెళ్ల చొప్పున దిగుమతి చేసుకుంటున్నాం. చౌకగా లభించే ఆ ముడి చమురు వల్ల మనం లాభపడటం మాట అటుంచి ప్రపంచ చమురు మార్కెట్ స్థిరత్వం సాధించింది. వర్తమాన సంక్లిష్ట పరిస్థితుల్లో రష్యాతో సాన్నిహిత్యం ఇబ్బందికరమే అయినా, దేశ ప్రయోజనాల రీత్యా దాన్ని కొనసాగించాలనుకున్న మన దేశ వైఖరి మెచ్చదగినది. ఏదేమైనా రెండు దేశాల మధ్య ఉండే ద్వైపాక్షిక సంబంధాలను మూడో దేశం ప్రభావితం చేయాలనుకోవటం, వాటిని తెంచుకోవాలని ఒత్తిడి తీసుకురావటం మంచి సంప్రదాయం కాదు. తన పర్యటన ద్వారా అమెరికాకు ఈ సంగతిని స్పష్టం చేసిన ప్రధాని మోదీ చర్య ప్రశంసించదగ్గది.

# మళ్లీ 'టీఆర్ఎస్'! బీఆర్ఎస్ పేరు మార్పుపై సాగుతున్న అధ్యయనం

**త్వరలో ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించే యోచన**

**అసెంబ్లీ ఎన్నికల తర్వాత నుంచి పెరుగుతున్న ఒత్తిడి**

**తెలంగాణతో పేగుబంధం తెగిపోతుందనే భావన**

**సరైన కారణాలు చూపితే 'టీఆర్ఎస్'కు మార్గం సుగమం**




హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పేరు తెలంగాణ రాష్ట్ర సమితి(టీఆర్ఎస్)గా మార్చాల్సిందేనంటూ పార్టీ నేతలు, కార్యకర్తల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పార్టీ పేరు మార్పునకు సంబంధించిన ప్రక్రియ కోసం త్వరలో కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలవాలని బీఆర్ఎస్ యోచిస్తోంది. పార్టీ పేరును తిరిగి 'టీఆర్ ఎస్'గా మార్చేందుకు అనురించాల్సిన ప్రక్రియపై ఇప్పటికే పార్టీపరంగా అధ్యయనం జరుగుతోంది. పార్టీ పేరు మార్పునకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలను కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. బీఆర్ఎస్ పేరును తిరిగి టీఆర్ఎస్‌గా మార్చడం సాంకేతికంగా సాధ్యమేనని ఎన్నికల సంఘం నిబంధనలు వెల్లడిస్తున్నట్టు పార్టీవర్గాలు తెలిపాయి. అయితే తిరిగి టీఆర్ఎస్‌గా పేరును మార్చేందుకు కేంద్ర ఎన్నికల సంఘం బీఆర్ఎస్ నుంచి పలు వివరణలు కోరే అవకాశమున్నందున, అవసరమైన సమాచారాన్ని కూడా సిద్ధం చేసుకోవడంపై దృష్టి సారించింది.

### 'టీఆర్ఎస్'పై ఆరేళ్లు ఫ్రీజ్

'తెలంగాణ రాష్ట్ర సమితి'పేరు ఇతరులకు కేటాయించకుండా ఎన్నికల సంఘం ఆరేళ్ల పాటు ఫ్రీజ్ చేసింది. పేరు మార్పుకు బీఆర్ఎస్ నుంచి అందిన దరఖాస్తును ఆమోదిస్తే ఓటర్లలో ఏదైనా గందరగోళం ఏర్పడుతుందా అనే విషయాన్ని ఎన్నికల సంఘం ప్రధానంగా పరిశీలిస్తుందని పార్టీవర్గాలు చెబుతున్నాయి. తిరిగి టీఆర్ఎస్‌గా పేరు మార్పునకు ఎన్నికల సంఘం అంగీకరిస్తే పార్టీ ఎన్నికల చిహ్నం 'కారు గుర్తు'తిరిగి దక్కుతుందా లేదా అంశాన్ని కూడా బీఆర్ఎస్ అధ్యయనం చేస్తోంది. పేరు మార్పుకు అవసరమైతే పార్టీ నియమావళిని సవరించాల్సి ఉంటుంది. ఈ మేరకు పార్టీ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి నియమావళిలో సవరణలను ఆమోదించాల్సి ఉంటుంది. బీఆర్ఎస్ పేరును తిరిగి టీఆర్ఎస్‌గా మార్చడంపై పార్టీ చేసే విన్నపాన్ని ఆమోదించే విచక్షణాధికారం కేంద్ర ఎన్నికల సంఘానికే ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈసీ నియమావళిని లోతుగా అధ్యయనం చేసి పార్టీ పేరు మార్పుపై సాధ్యాసాధ్యాలపై ఇప్పటికే ప్రాథమికంగా ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. త్వరలో జరిగే పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పార్టీ పేరు మార్పు అంశంపై తీర్మానం చేసే అవకాశముందని బీఆర్ఎస్ నేతలు వెల్లడించారు.

### జాతీయ రాజకీయాల కోసం 'బీఆర్ఎస్'..

తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా 2001 ఏప్రిల్ 27న ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్ర సమితి రెండు దశాబ్దాల అనంతరం పార్టీ పేరును మార్చుకుంది. జాతీయ రాజకీయాల్లో పార్టీ కార్యకలాపాల విస్తరణకు 2022 అక్టోబర్ 5న భారత రాష్ట్ర సమితిగా పేరు మార్చారు. పార్టీ పేరు మార్పిడికి కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం తెలపడంతో పార్లమెంటు, అసెంబ్లీలోనూ బీఆర్ఎస్ పేరు మార్పునకు ఆమోదముద్ర పడింది. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పేరిట పోటీ చేసి రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై ఈ ఏడాది జనవరిలో లోక్‌సభ నియోజకవర్గాల వారీగా జరిగిన పోస్ట్‌మార్టమ్‌లో పార్టీ పేరు మార్చడం కూడా ఓటమికి ప్రధాన కారణంగా పార్టీ శ్రేణులు నొక్కి చెప్పాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అన్ని చోట్లా ఓటమి పాలవడంతో పార్టీ పేరును తెలంగాణ రాష్ట్ర సమితిగా మార్చాలని అధినేత కేసీఆర్‌పై ఒత్తిడి చేస్తున్నారు. ఎర్రవల్లి నివాసంలో జరిగిన భేటీల్లోనూ పార్టీ నేతలు ఇదే అంశాన్ని కేసీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. పార్టీ పేరు మార్పుతో 'తెలంగాణతో పేగుబంధం తెగిపోయిందనే భావన'ప్రజల్లో నెలకొందని కొందరు అధినేతకు వివరించారు. ఈ నేపథ్యంలో పార్టీ పేరును తిరిగి టీఆర్ఎస్‌గా మార్చడానికి ఉన్న సాధ్యాసాధ్యాలపై అధ్యయనం జరుగుతోంది.

# 'కామ్'గా నెట్టేసి.. కోట్లు కొట్టేసి



హైదరాబాద్: ఒక వెబ్‌సైట్ అడ్రస్‌కు సంబంధించి చివరలో ఉండే .కామ్‌కు బదులు .నెట్ ఎంటర్ చేస్తే ఏమవుతుంది? ఆ సైట్ తెరుచుకోకపోవడమో లేదా మరో సైట్‌కు కనెక్ట్ కావడమో జరుగుతుంది. అయితే అకౌంట్ టేకోవర్ ఫ్రాడ్స్‌లో ఇలా జరిగితే మాత్రం భారీగా ఆర్థిక నష్టం వస్తుంది. నగరానికి చెందిన వ్యాపారవేత్తలు, సంస్థలు తరచూ ఈ నేరాల బారినపడుతున్నాయి. ఇలాంటి ఓ ఈ–మెయిల్‌ను నమ్మిన రాయదుర్గంలోని నాలెడ్జ్ సిటీ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే ఓ ఫార్మాస్యూటికల్ కంపెనీ ఇటీవల ఏకంగా రూ.11.4 కోట్లు సైబర్ నేరగాళ్ల ఖాతాకు బదిలీ చేసింది. అమెరికాకు చెందిన బ్యాంకు అప్రమత్తతతో ఈ మొత్తం సేఫ్‌గా ఉన్నా, రాజధాని కేంద్రంగా తరచూ ఈ అకౌంట్ టేకోవర్ ఫ్రాడ్స్ జరుగుతున్నట్టు చెబుతున్న తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ కేవీఎం.ప్రసాద్ ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలంటున్నారు.

### బాధితులుగా మారేది వ్యాపారులు, సంస్థలే..

అకౌంట్ టేకోవర్‌గా పిలిచే ఈ సైబర్ నేరాల్లో ఒకప్పుడు బాధితులంతా ఉత్తరాదిలో ఉన్న వ్యాపారులే ఉండేవారు. ఆపై హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఈ తరహా నేరాలు జరుగుతున్నాయి. ఈ సైబర్ నేరం చేయడానికి తొలుత నైజీరియన్లు గ్రూపులుగా ఏర్పడి వ్యాపార/ఆర్థిక లావాదేవీలతో కూడిన ఈ–మెయిల్ ఐడీలను గుర్తించి హ్యాక్ చేస్తారు. అందులో ఉండే లావాదేవీలతోపాటు వారి భాషాశైలి, చెల్లింపులు/వసూళ్ల విధానాన్ని కొంతకాలం పాటు క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ప్రధానంగా ఇంపోర్ట్–ఎక్స్‌పోర్ట్ వ్యాపారం చేసే వారే ఎక్కువగా టార్గెట్ అవుతున్నారు. హ్యాకింగ్ చేసిన తర్వాత ఏ దశలోనూ సదరు వ్యాపారికి అనుమానం రాకుండా జాగ్రత్త పడతారు.

### చిక్కకుండా ఉండేందుకు జాగ్రత్తలు

అకౌంట్ టేకోవర్ స్కామ్స్‌లో టార్గెట్ చేసిన సంస్థ నుంచి డబ్బు డిపాజిట్ చేయించుకోవడానికి బ్యాంకు ఖాతాలు ఎంతో కీలకం. వీటిని వారే నేరుగా తెరిస్తే పోలీసులకు దొరికే అవకాశాలు ఉంటాయి. ఇలా కాకుండా ఉండేందుకు ఇక్కడివే, బోగస్ చిరునామాలతో ఉండేవి తప్పనిసరి. దీనికోసం నైజీరియన్లు భారీ పథక రచన చేస్తున్నారు. నకిలీ పత్రాలతో వీటిని తెరుస్తున్నారు. రాయదుర్గంలోని ఫార్మా స్యూటికల్ సంస్థ నుంచి రూ.11.4 కోట్లు కాజేయడానికి ప్రయత్నించిన నేరగాళ్లూ ఇలానే చేశారు. అయితే నగదు రిసీవ్ చేసుకునే సంస్థ పేరుతోనే బ్యాంకు ఖాతా తెరవడం సాధ్యం కాలేదు. కొద్దిగా మార్పులతో కూడిన పేరుతో సంస్థను ఏర్పాటు చేసి ఆ పేరుతో ఖాతా తెరిచారు. రాయదుర్గం సంస్థ నుంచి వెళ్లిన నగదును అమెరికాలోని బ్యాంకు నేరుగా ఈ ఖాతాలోకి బదిలీ చేయాల్సి ఉండగా, కంపెనీ పేరుతో ఉన్న మార్పును గమనించి ఆ మొత్తాన్ని హోల్డ్‌లో పెట్టింది. దీంతో రూ.11.4 కోట్లు నేరగాళ్ల పాలు కాకుండా ఆగాయి.

### చిన్నచిన్న మార్పులతో మెయిల్ ఐడీలు...

సైబర్ నేరగాళ్లు ఇలా హ్యాక్ చేసిన ఈ–మెయిల్‌ను నిరంతరం అధ్యయనం చేయడం ద్వారా వారికి డబ్బు రావాల్సి, చెల్లించాల్సిన సమయం వచ్చే వరకు వేచి చూస్తున్నారు. సరైన టైమ్‌లో నగదు రిసీవ్ చేసుకునే సంస్థ పేరును పోలిన, అదే యూజర్ నేమ్‌తో కూడిన, ఆఖరులో ఉండే .కామ్, .నెట్ తదితరాలను మార్చి ఈ–మెయిల్ ఐడీలు క్రియేట్ చేస్తున్నారు. వీటిని వినియోగించి నగదు పంపాల్సిన సంస్థకు నగదు రిసీవ్ చేసుకునే సంస్థ నుంచి వచ్చినట్టే ఈ–మెయిల్ పంపుతున్నారు. అందులో ఆడిటింగ్, ఫైనాన్షియల్ ఇయర్ ఎండింగ్‌లతోపాటు సాంకేతిక కారణాలను వివరిస్తూ..నిత్యం నగదు బదిలీ చేసే బ్యాంక్ ఖాతాకు కాకుండా మరో దానికి పంపాల్సిందిగా కోరుతున్నారు. రాయదుర్గంలోని ఫార్మా స్యూటికల్ సంస్థ విషయంలో ఇలానే జరిగింది. ఈ సంస్థకు ముడిసరుకు సరఫరా చేసే అమెరికన్ సంస్థను పోలిన ఈ–మెయిల్ ఐడీ సృష్టించారు. అసలు దానికి చివరలో .కామ్ ఉంటుంది. అయితే సైబర్ నేరగాళ్లు .నెట్‌తో ముగిసేలా మరోటి సృష్టించారు. దీని ఆధారంగా మెయిల్ పంపి రూ.11.4 కోట్లకు సమానమైన అమెరికన్ డాలర్లు తమ ఖాతాల్లో వేయించుకున్నారు.

### సరిచూసుకోకుంటే నష్టపోవాల్సిందే

అకౌంట్ టేకోవర్ నేరాల్లో ప్రతి ఏడాది నగరానికి చెందిన వ్యాపారులు, వ్యాపార సంస్థలు రూ.లక్షలు, కోట్లల్లో నష్టపోతున్నారు. ఈ–మెయిల్స్ విషయంలో చాలామంది దాన్ని పంపిన యూజర్ నేమ్ చూసి ఎదుటివారు తమ వారే అని భావిస్తారు. అనేక ఈ–మెయిల్ ఖాతాలకు ఒకే యూజర్ నేమ్ ఉండవచ్చు. అందులో ప్రధానంగా యూజర్ ఐడీని చూడాలి. ఈ–మెయిల్స్ అవి పంపిన సంస్థల నుంచి వచ్చినట్టు ఉన్నా.. ఆఖరులో .కామ్ ఉందా? .నెట్ ఉందా? అనేది క్షుణ్ణంగా గమనించాలి. సైబర్ నేరగాళ్లు ఎక్కువగా ఇంటర్ నెట్‌లో ఫ్రీగా దొరికే '.ఓఆర్జీ'తో కూడినవి తయారు చేసి వాడతారు. ఈ తరహా నేరాల్లో నిందితులు చిక్కడం, నగదు రికవరీ కావడం కష్టసాధ్యం. – కేవీఎం.ప్రసాద్, డీఎస్పీ,తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో

### అకౌంట్ టేకోవర్ నేరాల్లో నష్టపోయిన కొన్ని సంస్థలు...

2020 జూలై కేపీసీ ఇన్‌ఫ్రా, హైదరాబాద్ రూ.9.9లక్షలు 2020 అక్టోబర్ పోకర్ణ ఇంజనీరింగ్ స్టోన్ లిమిటెడ్ రూ.2.09లక్షలు 2021 ఫిబ్రవరి హేమా ఎలక్ట్రానిక్స్, సికింద్రాబాద్ రూ.లక్ష 2021 జూన్ నిర్మా సిన గ్లాస్ కంపెనీ, మాసబ్‌ట్యాంక్ రూ.55లక్షల స్వాహాకు యత్నం 2022 ఏప్రిల్ అమీర్‌పేటకు చెందిన ఓ సంస్థ రూ.1.19కోట్లు 2022 జూలై నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్ రూ.64లక్షలు 2023 ఫిబ్రవరి హెచ్‌బీఎల్ పవర్ సిస్టమ్స్ లిమిటెడ్ సంస్థ, బంజారాహిల్స్ రూ.1.16కోట్లు 2023 మార్చి ఏబీఆర్ ఆర్గానిక్స్ లిమిటెడ్ సంస్థ, బాగ్‌అంబర్‌పేట రూ.7లక్షలు

## భారత్-రష్యా సంబంధాలపై అమెరికా కీలక వ్యాఖ్యలు..



భారత్-రష్యా సంబంధాలపై అమెరికా కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ సంబంధాలపై ఆందోళన ఉన్నప్పటికీ అమెరికాకు భారత్ వ్యూహాత్మక భాగస్వామి అని బైడెన్ అడ్మినిస్ట్రేషన్ చెప్పింది. భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సు కోసం ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల పాటు రష్యాలో పర్యటించారు. పలు ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి. పుతిన్, మోడీ ఇద్దరు రెండు దేశాల సంబంధాలపై మాట్లాడారు. ఇదే విధంగా ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించాలని, యుద్ధం పరిష్కారం కాదని మోదీ, పుతిన్‌తో చెప్పారు. బాంబులు, బుల్లెట్ల మధ్య శాంతి ప్రయత్నాలు విజయవంతం కావని అన్నారు. మంగళవారం రష్యాతో భారత్ సంబంధాలపై, మోదీ రష్యా పర్యటనపై పెంటగాన్, యూఎస్ విదేశాంగ శాఖ ప్రతినిధులు విడివిడిగా స్పందించారు. "భారతదేశం మరియు రష్యా చాలా కాలంగా బంధాన్ని కలిగి ఉన్నాయి. యుఎస్ దృష్టికోణంలో, భారతదేశం ఒక వ్యూహాత్మక భాగస్వామి, దీనితో మేము రష్యాతో వారి సంబంధాన్ని చేర్చడానికి పూర్తి మరియు స్పష్టమైన సంభాషణను కొనసాగిస్తాము. ఈ వారం జరగబోయే నాటో శిఖరాగ్ర సమావేశంతో ముడిపడి ఉంది. మీలాగే ప్రపంచం కూడా ఈ విషయంపై దృష్టి పెట్టింది." అని పెంటగాన్ ప్రెస్ సెక్రటరీ మేజర్ జనరల్ పాట్ రైడర్ ఒక వార్తా సమావేశంలో విలేకరులతో అన్నారు. యుఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ మాట్లాడుతూ.. "రష్యాతో భారత్ సంబంధాల గురించి అమెరికా చాలా స్పష్టంగా ఉంది" అని చెప్పారు. దీనిని భారత్ ప్రభుత్వంతో ప్రైవేటుగా వ్యక్తపరిచామని అన్నారు. మేజర్ జనరల్ రైడర్ మాట్లాడుతూ.. భారతదేశాన్ని వ్యూహాత్మక భాగస్వామిగా చూడటం కొనసాగిస్తాము. మేము వారితో బలమైన సంభాషణను కొనసాగిస్తాము అని చెప్పారు. పుతిన్ ఈ పర్యటన ద్వారా తాము మిగతా ప్రపంచంతో వేరుకాలేదని చూపించుకునేందుకు ప్రయత్నించారని అన్నారు. నిజానికి పుతిన్ ఈ యుద్ధం ద్వారా మిగతా ప్రపంచంతో రష్యాను వేరు చేశారని చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాధినేత(మోడీ), పుతిన్‌ని కౌగిలించుకోవడం చూస్తే ఆయన ప్రపంచం నుంచి ఏకాకి కాలేదని అనిపిస్తోందని విలేకరులు ప్రశ్నించిన నేపథ్యంలో ఆయన ఇలా స్పందించారు.

## పీసీబీ ఫైల్స్ దహనం కేసులో ట్విస్ట్..




ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన పీసీబీ ఫైల్స్ దహనం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది.. బెజవాడ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయంలో దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.. పీసీబీలో ఏడు సెక్షన్లకు సంబంధించిన అధికారులను విచారిస్తున్నారు.. పీసీబీ సెక్షన్ కార్యాలయంలో ఉండాల్సిన ఫైల్స్ బయటకు రావడంపై సంబంధిత అధికారులను ప్రశ్నిస్తున్నారు.. కార్యాలయంలో ఉండాల్సిన ఫైల్స్, హార్డ్ డిస్క్ లు బయటకు వెళ్లటంలో అధికారుల పాత్రపై విచారణ కొనసాగుతోంది.. ఫైల్స్ లో ఉన్న అంశాలు, వాటి ప్రాధాన్యత గురించి స్టేట్ మెంట్స్ రికార్డు చేస్తున్నారు పోలీసులు.. శాఖ ఫైల్స్ బయటకు ఎలా వెళ్లాయి అనే అంశంపై అధికారులను పూర్తిస్థాయిలో ప్రశ్నిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఇక, ఈ కేసు విచారణలో పోలీసులకి %ూణ% రామారావు చుక్కలు చూపించినట్టుగా ప్రచారం సాగుతోంది.. ఆ డాక్యుమెంట్స్ పనికిరావని పోలీసులకి విచారణలో చెప్పారట రామారావు.. కానీ, ఆ ఫైల్స్ పడేయాలని చెప్పిన వారి గురించి మాత్రం రామారావు నోరు విప్పలేదట.. ప్రభుత్వ డాక్యుమెంట్స్ డిస్పోజ్ చేసేందుకు ఉన్న ప్రొసీజర్ ఎందుకు ఫాలో అవ్వలేదో కూడా రామారావు చెప్పలేదని తెలుస్తోంది.. పోలీసులు స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్స్ లో కొన్ని పీసీబీ వెబ్ సైట్ లో ఓపెన్ డాక్యుమెంట్స్ గా ఉన్నట్టు పోలీసులు గుర్తించారు.. ఇక, దహనం చేసేందుకు ప్రయత్నించిన ఫైల్స్ లో కీలకమైనవి ఏమన్నా ఉన్నాయా అనే గుర్తించే పనిలో పడిపోయారు పోలీసులు.. కాగా, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ రికార్డుల దగ్ధం కేసు కలకలం రేపింది.. ఈ కేసులో ఓఎస్డీ ఎస్వీ రామారావుని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు.. సగం కాలిన రికార్డులు, హార్డ్ కాపీలను కూడా గన్నవరం తీసుకెళ్లారు పోలీసులు. ఎక్సైజ్ శాఖలో సుదీర్ఘ కాలం పనిచేసిన రామారావుపై.. గతంలోనూ అవినీతి ఆరోపణలు ఉన్నాయి. మరోసారి ఫైల్స్ దగ్ధం ఘటనలో రామారావు పేరు రావడంపై ఎక్సైజ్ శాఖలో చర్చగా మారిన విషయం విదితమే.

## ఆర్థిక శాఖపై ఏపీ సీఎం చంద్రబాబు సమీక్ష..



చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్రంలో తాజాగా ఉన్న ఆర్థిక పరిస్థితిపై చర్చించే అవకాశం ఉంది.రాష్ట్రానికి ఉన్న అప్పులు లెక్కలపై చంద్రబాబు ఆరా తీశారు. ఇప్పటికే అన్ని రకాల అప్పులు కలిపి మొత్తంగా 14 లక్షల కోట్ల రూపాయలు ఉన్నాయని ఆర్థిక శాఖ అధికారుల ప్రాథమిక అంచనా వేశారు. పెండింగ్ బిల్లులు ఎంత మొత్తంలో ఉన్నాయనే అంశంపై ఏపీ సీఎం సమీక్షించనున్నారు. పెండింగ్ బిల్లుల వివరాలు కోరుతూ ఇప్పటికే శాఖల వారీ వివరాలను ఆర్థిక శాఖ కోరింది. రాష్ట్రానికి వస్తున్న ఆదాయాలు, కేంద్రం నుంచి రాబట్టాల్సిన నిధులపై ఫోకస్ పెట్టింది. ఇక, పూర్తి స్థాయి బడ్జెట్ కాకుండా ఓటాన్ అకౌంట్ ఆర్డినెన్స్ ప్రవేశ పెట్టాలని ఆర్థిక శాఖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ముందు ప్రతిపాదన పెట్టే అవకాశం ఉంది. ఓటాన్ అకౌంట్ ఆర్డినెన్స్ పెట్టే అంశంపై ఇవాళ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ఆర్థిక శాఖపై విడుదల చేయాల్సిన శ్వేత పత్రంపై సీఎం కసరత్తు చేయనున్నారు. దీంతో పాటు మధ్యాహ్నం 3. 30 గంటలకు ఎక్సైజ్ శాఖ మీద కీలక సమీక్ష చేయనున్నారు. కొత్త ఎక్సైజ్ పాలసీ, గత ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణంపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఆ తర్వాత బీపీసీఎల్ ఛైర్మన్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు కలవనున్నారు.

## జగన్ రాజీనామాపై వైవీ సుబ్బారెడ్డి ఏమన్నారంటే..



ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వం అధికారం కోల్పోయిన తరువాత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పై వస్తున్న వార్తలపై రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి స్పందించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓటమి చెందిన విషయం తెలిసిందే. గతంలో 151 అసెంబ్లీ , 21 ఎంపీ స్థానాలను సాధించిన వైసీపీ నేడు 11 అసెంబ్లీ, నాలుగు ఎంపీ స్థానాలకు మాత్రమే పరిమితమైంది. అసెంబ్లీలో కూటమి బలం 164 ఉండగా అక్కడ వైసీపీ ఎమ్మెల్యేలు చేసేదేమి లేదని జగన్ బహిరంగంగానే ప్రకటించారు. అసెంబ్లీలో కనీసం ప్రతిపక్ష హోదా దక్కకపోవడం జగన్ తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఒక దశలో తాను హిమాలయాలకు వెళ్లాలని భావించినట్లు కూడా ఆయన తెలిపారు. అసెంబ్లీలో మాట్లాడటానికి కూడా అవకాశం ఇవ్వరన్న అనుమానంతో వైఎస్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పార్లమెంట్‌కు వెళ్తున్నట్లు కొన్నిరోజులుగా విస్తృత ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంపై వైసీపీ సీనియర్ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి ప్రకాశం జిల్లాలో మీడియాతో మాట్లాడారు. వైఎస్ జగన్ రాజీనామా చేస్తారంటూ జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండించారు. జగన్ రాజీనామా చేయరు.. చేయాల్సిన పనిలేదని ఆయన స్పష్టం చేశారు.

# స్వాగతించాల్సిందే.. అయితే



విభజన సమస్యల పరిష్కారానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు రేవంత్రెడ్డి, చంద్రబాబు ఇటీవల భేటీ కావటం ఇందుకు సంబంధించిన తొలిఅడుగు. ఎలాంటి సమస్యనైనా చర్చల ద్వారానే పరిష్కరించుకోగలమన్న సందేశాన్ని వారు ప్రజలకు ఇవ్వటం హర్షణీయం. ఈ విషయంలో తెలుగు రాష్ట్రాల సీఎంలు తీసుకున్న చొరవను అభినందించాల్సిందే. చర్చలను స్వాగతించాల్సిందే. అయితే రాష్ట్ర విభజన జరిగిన నాటి నుంచి నేటి వరకూ గత పదేండ్లుగా అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలు ఇటు తెలంగాణకు, అటు ఆంధ్రాకు పీటముడిలా ఉన్నాయి. విభజన సందర్భంగా 'భౌగోళికంగా ఎక్కడి ఆస్తులు అక్కడి వారికే' అనే ఒప్పందం జరిగింది. అయితే ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి 23 జిల్లాల ప్రజాధనంతో అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, ఆర్టీసీ బస్భవన్, నిథమ్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్మెంట్) లాంటి సంస్థలను నెలకొల్పామని ఏపీ చెబుతోంది. అందువల్ల ఆయా సంస్థలు, వాటి ఆస్తులను లెక్కగట్టి రూ.లక్షా 42 వేల కోట్లను తెలంగాణ తమకు చెల్లించాలంటూ అక్కడి ప్రభుత్వం కోరుతోంది. ఈ లెక్క సరికాదనీ, ముందుగా చేసుకున్న ఒప్పందానికి విరుద్ధమని తెలంగాణ సర్కార్ వాదిస్తోంది. ఇదొక జఠిలమైన సమస్య. దీంతోపాటు విభజన చట్టంలో పేర్కొన్న ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఎన్టీపీసీ ఆధ్వర్యంలోని నాలుగు వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం పదేండ్ల నుంచి తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. కృష్ణా, గోదావరి నదీ జలాలకు సంబంధించి రివర్ మేనేజ్మెంట్ బోర్డులను ఏర్పాటు చేయకుండా కేంద్రం తాత్సారం చేసింది. మన రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలను కలిపేందుకు ఉద్దేశించిన రహదారుల నిర్మాణాలను మోడీ సర్కార్ ఇంకా ప్రారంభించనే లేదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ఉద్యోగుల సమస్యలు ఇంకా నానుతూనే ఉన్నాయి. వీటితో పాటు విభజన సందర్భంగా ఏపీలో విలీనమైన భద్రాచలం పరిసరాల్లోని ఐదు గ్రామాల ప్రజలు తీవ్రమైన ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. తమ గ్రామాలను తిరిగి భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో కలపాలంటూ వారు మొత్తుకుంటున్నారు. భద్రాచలం పట్టణం చుట్టూ ఆంధ్రా ప్రాంతమే విస్తరించి ఉండటం వల్ల కనీసం ఆ భద్రాచలానికి డంప్యార్డు లేకుండా పోయింది. పోలవరం బ్యాక్వాటర్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సి ఉంది. ఇలాంటి సమస్యలను రెండు ప్రభుత్వాలు త్వరితగతిన పరిష్కరించాలి. వీటి కోసం మూడు కమిటీలను ఏర్పాటు చేస్తున్నామంటూ రేవంత్, చంద్రబాబు ప్రకటించటం సంతోషదాయకం. మొదట ఉన్నతాధికారుల కమిటీ, అక్కడ పరిష్కారం కాకపోతే మంత్రుల కమిటీ, అక్కడా తేలకపోతే సీఎంల స్థాయిలో చర్చలు, సంప్రదింపులు, నిర్ణయాలు తీసుకునేందుకు అంగీకరించటం హర్షణీయం. అయితే 'కమిటీలు కాలయాపనకే' అనే మాట మన భారత రాజకీయాల్లో తరచూ వినబడుతూ ఉంటుంది. గతంలో అనేక విషయాల్లో వేసిన అనేకానేక కమిటీల పరిస్థితి ఇదే. రేవంత్, బాబు చెప్పిన కమిటీలు ఆ రకంగా మారకుండా చూడాల్సిన బాధ్యత కూడా వారిద్దరిదే. భద్రాచలం చుట్టుపక్కలనున్న ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలనే డిమాండ్ ఉంది. దీన్ని అన్ని రాజకీయ పార్టీలు బలపరిచాయి. అయితే ఒక సమస్య. రాజ్యాంగంలోని ఆర్టికల్-3 ప్రకారం రాష్ట్రాల హద్దులను నిర్ణయించాల్సింది కేంద్ర ప్రభుత్వం. గతంలో ఈ ఐదూళ్లను ఏపీలో కలిపింది కూడా అప్పటి బీజేపీ ప్రభుత్వమే. తిరిగి తెలంగాణలో కలపాల్సింది కూడా మోడీ సర్కారే. వెరసి బంతి కేంద్ర ప్రభుత్వ కోర్టులో ఉంది. ఇక్కడే మరో కీలకమైన అంశం, చంద్రబాబునాయుడు ఎన్డీయే భాగస్వామి అన్న విషయం రాష్ట్ర ప్రభుత్వ గమనంలో ఉండటం అవసరం. ఈ ప్రక్రియంతా సజావుగా, సుహృద్భావ వాతావరణంలో జరగాలంటే కేంద్రం చొరవ కూడా అంతే ముఖ్యం. దానిపై ఒత్తిడి తీసుకురావటం పైనే ఆయా గ్రామాల భవిష్యత్తు ఆధారపడి ఉంది. ఈ ఐదూళ్లే కాదు, ఆస్తులు, అప్పులు, ఇతర పంపకాలను ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ వీలైనంత త్వరగా తేలుస్తారని ఆశిద్దాం.

# ప్రజలను దోచుకుంటున్న జియో, ఎయిర్‌టెల్




జియో, ఎయిర్‌టెల్ కంపెనీలు సెల్ రీచార్జీలను భారీగా పెంచాయి. జియో 12 నుంచి 25 శాతానికి పెంచితే, ఎయిర్ టెల్ 11 నుంచి 21 శాతానికి పెంచింది. ఈ పెంపుదలతో జియో, ఎయిర్ టెల్ కంపెనీల లాభాలు రూ.20 వేల కోట్లకు పెరుగుతాయని మీడియా చెపుతున్నది.మరోవైపు, ఈ చార్జీల పెంపుదల ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటటంతో కుదేలైన తక్కువ ఆదాయం గల ప్రజలను, ముఖ్యంగా శ్రామిక వర్గాన్ని బాగా దెబ్బతీస్తుంటే ఈ చార్జీల పెరుగుదల పిడుగుపాటు అయింది. ఒక్కొక్క వినియోగదారుడి నుంచి వచ్చే సగటు ఆదాయం పెరుగుదల (యావరేజి రెవిన్యూ పర్ యూజర్) కోసం ఈ పెంపుదలను చేశామని టెలికం కంపెనీలు సమర్థించు కుంటున్నాయి. ఇది పూర్తిగా తప్పుదోవ పట్టించే ప్రకటన. ప్రయివేటు టెలికం కంపెనీలు ఇంత భారీగా చార్జీల ధరలు పెంచటానికి గల కారణం కనపడటం లేదు. జియో, ఎయిర్‌టెల్ కంపెనీలు ఇప్పటికే అత్యధిక లాభాలు దండుకున్నాయనేది కాదనలేని సత్యం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జియో రూ.20,607 కోట్లు నికర లాభం సంపాదించింది. ఇదే ఆర్థిక సంవత్సరంలో ఎయిర్ టెల్ రూ.7467 కోట్లు నికరలాభం సంపాదించింది. అందుచేత, సామాన్య ప్రజలను పిండి వసూలు చేసే ఈ చార్జీల పెంపుదల బొత్తిగా అనవసరమైనది. టెలికం రంగంలో ట్రారు నియంత్రణా సంస్థ ఉంది. లాభ దాహార్తితో పనిచేసే ప్రయివేట్ టెలికం కంపెనీలు ప్రజలను దోచుకోకుండా చూడటం కూడా ఈ ట్రారు విధుల్లో ఒకటి. అయితే, ఆచరణలో ఈ ట్రారు ప్రయివేట్ టెలికం కంపెనీల ప్రయోజనాల కోసమే పని చేస్తున్నది. 2016లో జియో తన సేవలను ప్రారంభించినప్పుడు నియంత్రణాసంస్థ నిబంధనలన్నిటినీ జియో అతిక్రమించింది. అప్పుడు ట్రారు మూగజీవిలా చూస్తూ ఉండిపోయింది. ఆ సమయంలో జె.ఎస్ దీపక్ అనే సీనియర్ అధికారి టెలికం డిపార్ట్‌మెంట్ కార్యదర్శిగా ఉన్నారు. ఇతను జియో చేసిన తీవ్ర ఉల్లంఘనలపట్ల అభ్యంతరాలు లేవనెత్తుతూ, జియోపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ట్రారుకి లేఖ రాశారు. ట్రారు ఎటువంటి చర్యను తీసుకోలేదు సరికదా, మోడీ ప్రభుత్వం టెలికం డిపార్ట్‌మెంట్ నుంచి జెఎస్ దీపక్‌ని రాత్రికి రాత్రే బయటకు నెట్టింది. ఇటువంటి పరిస్థితుల్లో, బిఎస్ఎన్ఎల్ మాత్రమే టెలికం రంగంలో నిజమైన నియంత్రణా సంస్థగా పనిచేసింది. బిఎస్ఎన్ఎల్ నుంచి ఉన్న తీవ్ర పోటీ కారణంగా తమ ఇష్టానుసారం టారిఫ్ చార్జీలను పెంచలేకపోయాయి. ఈ పరిస్థితి ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. ఏమైనా, ఈరోజు దాకా బిఎస్ఎన్ఎల్ 4జి, 5జి సేవలను ప్రారంభించలేక పోయింది. దీని ఫలితంగా ప్రవేటు కంపెనీలతో సమాన స్థాయిలో పోటీ పడటానికి అవరోధం ఏర్పడింది. బిఎస్ఎన్ఎల్ లో 4జి, 5జి సేవలు అందుబాటులో లేనందువల్ల బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు హైస్పీడ్ డేటా సేవలు పొందే అవకాశం కోల్పోతున్నారు. దీనితో తప్పనిసరై, వినియోగ దారులు పెద్ద సంఖ్యలో బిఎస్ఎన్ఎల్‌ను వదిలి, జియో, ఎయిర్‌టెల్ వైపు మరలుతున్నారు. ట్రారు విడుదల చేసిన లెక్కల ప్రకారం, 2023-24 ఒక ఏడాదిలోనే బిఎస్ఎన్ఎల్ భారీ స్థాయిలో 1.8 కోట్ల మంది వినియోగదారులను పోగొట్టుకుంది. 2024 మార్చి ఒక్క నెలలోనే 23.54 లక్షల మంది వినియోగదారులు బిఎస్ఎన్ఎల్ వదిలి వెళ్లారు. అదే నెలలో రిలయన్స్ జియో 21.43 లక్షల మంది కొత్త వినియోగదారులను, ఎయిర్ టెల్ 17.5 లక్షలమంది కొత్త వినియోగదారులను పొందగలిగాయి. ఈ పరిణామాలన్నీ జియో, ఎయిర్ టెల్ భారీగా టారిఫ్ చార్జీలు పెంచడానికి ప్రోత్సహించాయి. బిఎస్ఎన్ఎల్ ఇప్పటిదాకా 4జి, 5జి సేవలను ఎందువలన ప్రారంభించలేక పోయింది? ఎందువలనంటే మోడీ ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్‌కు రెండు ప్రతిబంధకాలు కల్పించింది. ఒకటి: 2019లో బిఎస్ఎన్ఎల్‌కు అప్పుడున్న 3జి నెట్‌వర్క్ ను 4జి నెట్‌వర్క్‌గా అప్‌గ్రేడ్ చేయడానికి అనుమతించలేదు. రెండు: తిరిగి 2020లో రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్‌లతో విదేశీ అమ్మకందారుల నుంచి ప్రామాణికమైన 4జి పరికరాలను బిఎస్ఎన్ఎల్ కొనుగోలు చేయటాన్ని నిషేధించారు. భారతదేశ పరికరాల తయారీదారుల నుంచి మాత్రమే 4జి పరికరాలు బిఎస్ఎన్ఎల్ కొనవలసిన తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. 2023 మే నెలలో, మాజీ సమాచార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, ఇక కొద్ది వారాలలో బిఎస్ఎన్ఎల్ 4జి సేవలు ప్రారంభిస్తుందని, అదే ఏడాది నవంబరు లేక డిసెంబర్ నాటికల్లా ఈ సేవలనే 5జికి అప్‌గ్రేడ్ చేస్తామని గొప్పలు చెప్పారు. అయితే, బిఎస్ఎన్ఎల్ కనీసం 4జి సేవలను సైతం ఈనాటికి కూడా ప్రారంభించలేక పోయింది. ఈ కారణాలన్నిటిని దృష్టిలో పెట్టుకొని బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ (బిఎస్ఎన్ఎల్ఇయు), బిఎస్ఎన్ఎల్ తన కస్టమర్లకు 4జి సేవలు అందించడానికి వోడాఫోన్ ఐడియా నెట్‌వర్క్‌ను వాడుకోవడానికి అనుమతివ్వమని డిమాండ్ చేసింది. వోడాఫోన్ ఐడియాలో ప్రభుత్వమే అతిపెద్ద వాటాదారుగా ఉన్నప్పుడు, ఈ ప్రతిపాదనను తేలికగా అమలులో పెట్టవచ్చు. కానీ అలా జరగలేదు. బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ఈ డిమాండ్‌ను అమలులో పెట్టమని దేశవ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించింది. జియో, ఎయిర్ టెల్ తమ చార్జీలను భారీగా పెంచిన సందర్భంలో బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, బిఎస్ఎన్ఎల్ తక్షణమే 4జి సేవలు ప్రారంభించటానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, దానిని త్వరగా 5జిగా అప్‌గ్రేడ్ చేయాలని సమాచార శాఖ మంత్రికి మరోసారి లేఖ రాసింది. 4జి, 5జి సేవలు ప్రారంభిస్తే సామాన్య ప్రజానీకానికి హైస్పీడ్ డాటా సేవలను, తక్కువ టారిఫ్ చార్జీలతో బిఎస్ఎన్ఎల్ అందించగలుగుతుంది.

# మారని జగన్! మాయని గర్వం



అసెంబ్లీ ఎన్నికలల్లో ఘోర పరాజయం చెందిన తర్వాత కూడా తత్వం బోధపడని వైఎస్ జగన్.. తనకి తాను నిజాయ తీపరుడిగా, సత్యహరిశ్చంద్రుడి వారసు డిలాగా ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. తానెందుకు ఓడిపోయానో అర్థంకావడం లేదని వాపోతున్నారు. ఏమాత్రం ఆత్మ పరిశీలన చేసుకోకుండా, ఓటమి నుంచి గుణపాఠాలు నేర్చుకోకుండా ప్రజలపై నిందలు మోపుతున్నారు. చంద్రబాబులా అబద్దాలు చెబితే మరో పదిశాతం ఓట్లు వచ్చేవి, మనమే అధికారంలోకి వచ్చేవారమని చెప్పుకొచ్చారు. అధికారం కోసం అబద్దాలు చెప్పడం సరికాదని, అబద్దాలు చెప్పక, వాస్తవాలు మాట్లాడటం వల్లే తాను ఓటమి చెందినట్లుగా చెబుతున్నారు. 2019లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జగన్మోహన్ రెడ్డి అబద్దాలు చెప్పని రోజంటూ లేదు. ఆయన చెప్పినవన్నీ అబద్దాలు, అసత్యాలు, అర్ధసత్యాలే. మద్య నిషేధం అమలుచేస్తేనే ఓట్లు అడుగుతానని చెప్పి, అమలు చేయకుండా ఓట్లడగడంతో ఓటర్లు చాచి కొట్టారు. ప్రత్యేక హోదా, సీపీఎస్, పోలవరం, అమరావతి వంటి విషయాల్లో మాటతప్పి, మడమతిప్పి సిగ్గూ, ఎగ్గూ లేకుండా 98శాతం అమలుచేశానని ఇప్పటికీ జబ్బలు చరుచుకుంటున్నారు. రాష్ట్రాభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. ఒక్క పరిశ్రమ రాకపోగా.. ఉన్న పరిశ్రమలను పొరుగు రాష్ట్రాలకు తరిమివేశారు. ఏటా జాబ్ కేలండర్ విడుదల చేస్తానని మాటతప్పారు. దీంతో నిరుద్యోగం పెరిగింది. ఉద్యోగ, ఉపాధి కోసం యువత పొరుగు రాష్ట్రాలకు తరలివెళ్లారు.

### ఈవీఎంలే ఓటమికి కారణమట..!

ఎన్నికలు ముగిసి నెల రోజులు కాలేదు, కొన్ని రోజుల క్రితమే సభలో సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు, అప్పుడే ఎదురుదాడి మొదలుపెట్టారు. ప్రత్యేక హోదా తీసుకురాలేదని చెబుతూ శిశు పాలుడు వంద తప్పుల్లో ఒక తప్పు జరిగి పోయిందని చెప్పడం జగన్ రెడ్డి ఉక్రోషానికి అద్దం పడుతోంది. నిన్నటిదాకా వై నాట్ 175 అని, ఇప్పుడు కాస్త కనికరిస్తూ జాలిపడి 2029 నాటికి తెలుగుదేశానికి సింగిల్ డిజిట్ వస్తాయని ఉత్తరకుమార ప్రగల్బాలు పలుకుతున్నారు. ఏపీలో రాబోయే ఎన్నికల పలితాలు చూసి దేశం నివ్వెరపోతుందని జగన్ రెడ్డి చెబుతుంటే.. ఆ పార్టీ శ్రేణులు కూడా నవ్వుకున్నారు. కానీ వచ్చిన ఫలితాలు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. గెలుపుపై భారీ అంచనాలు పెంచుకున్నారు. ఎమ్మెల్యేలపై బాగా వ్యతిరేకత ఉంది, తనపై ఏదో సానుకూలత ఉన్నట్లు, తననేదో ప్రజలు బాగా ఆరాధిస్తున్నట్లు భ్రమల్లో విహరించారు. ఈవీఎంలపైనా, ప్రజలపైనా తప్పును నెట్టే ప్రయత్నం చేస్తున్నారు. 164 స్థానాల్లో ఓడిపోతే అందుకు జగన్ రెడ్డి బాధ్యత వహించాలి కదా?

### నొక్కుడు తక్కువ.. బొక్కుడు ఎక్కువ

ఇంత ఘోరంగా ఓడిపోయిన తర్వాత కూడా రాష్ట్ర ప్రజల్లో ఏమాత్రం అతనిపట్ల సానుభూతి కనిపించలేదు. రుషికొండ, పార్టీ కార్యాలయాల నిర్మాణ శైలి చూసిన తర్వాత 11 సీట్లు కూడా ఎందుకు గెలిపించామని ప్రజలు భావిస్తున్నారు. ఈ ఐదేళ్లు కళ్లు మూసుకోండి.. మళ్లీ మనమే అధికారంలోకి రాబోతున్నామని కేఏ పాల్ ను మించిన హాస్యాన్ని పండిస్తున్నారు. జగన్ రెడ్డిలో ఎలాంటి మార్పు వచ్చినట్లు కనిపించడం లేదు. కనీసం ఓటమిపై ఎలాంటి సమీక్షలు లేవు. ఆయన రోదనలు, వేదనలు హావభావాలు చూస్తుంటే జాలేస్తోంది. రూ.2.70 లక్షల కోట్లు డీబీటీ ద్వారా తను కష్టపడి సంపాదించిన సొమ్మును అక్కచెల్లెళ్లలకు, అవ్వాతాతలకు పంచినట్లుగా తెగ బాధపడ్డారు. అక్కచెల్లెమ్మల ప్రేమలు, అవ్వాతాతల అప్యాయతలు ఏమయ్యాయని రోదిస్తున్నారు. ఇన్నిసార్లు బటన్ నొక్కినా కానీ ప్రజలు తననెందుకు మోసం చేశారని పదేపదే వాపోతున్నారు. రాష్ట్రంలో జరిగింది పాలన కాదు పీడన. మేం పన్నుల రూపంలో చెల్లించిన సొమ్మును తిరిగి మాకే చెల్లించారు. సిద్ధం సిద్ధం అంటూ మాపై యుద్ధం చేశారని ప్రజలు భావించారు. బటన్ నొక్కుడు కంటే బొక్కుడు ఎక్కువైందని ఆలస్యంగా గ్రహించారు.

### కోడికత్తి నుంచి గులకరాయి దాకా...

ఓటమిపై ఇప్పటికీ సరైన విశ్లేషణ కానీ, వైసీపీ నేతల నుంచి అభిప్రాయాలు తెలుసుకోకుండా పదేపదే ఆత్మస్తుతి, పరనిందకు పాల్పడుతున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ రెడ్డి చేయని దుర్మార్గం లేదు. ప్రజాసమస్యలను పరిష్కరించకుండా ప్రతిపక్ష నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారు. అక్రమ కేసులతో వేధించారు. ముఖ్యమంత్రిగా జగన్ రెడ్డి, మంత్రులు, వైసీపీ ఎమ్మెల్యేలు తమ విధులను, బాధ్యతలను మర్చిపోయి అజ్ఞానంతో, అహంకారంతో ప్రజలపై స్వారీ చేశారు. దోచుకో దాచుకో అనే నినాదంతో ముందుకు వెళ్లారు. జగన్ రెడ్డి ఐ ప్యాక్ సర్వేలనే పూర్తిగా నమ్మారు. దీని ఆధారంగా ఆయా నియోజకవర్గాల్లో ఇంఛార్జ్ లను మార్చారు. అయినా ప్రజల నమ్మకాన్ని సాధించలేకపోయారు. గత ఎన్నికల్లో వైఎస్ వివేకా హత్యను, కోడికత్తి లాంటి డ్రామాలను సానుభూతి కోసం వాడుకున్నారు. ఈ ఎన్నికల్లో కూడా గులకరాయి డ్రామా ఆడారు. అయినా ప్రజలు విశ్వసించలేదు. సొంత తల్లికి, చెల్లికే న్యాయం చేయని వ్యక్తి ప్రజలకేం న్యాయం చేస్తారని ఓటర్లు భావించారు.

### తప్పులను అంగీకరించని అహంకారి

అసెంబ్లీ స్పీకర్ గా చింతకాయల అయ్యన్నపాత్రుడి కార్యక్రమానికి అధికార పక్షంతో పాటు ప్రతిపక్ష నేతలు కూడా హాజరై సభాపతి స్థానంలో కూర్చోబెట్టడం ఆనవాయితీ. జగన్ రెడ్డి కనీసం ఆ సభా సాంప్రదాయాలను కూడా మంటగలుపుతూ సభాపతి ఎన్నికకు గైర్హాజరయ్యారు. పులివెందుల పర్యటనలోనూ సొంత పార్టీ నేతల నుంచి జగన్ రెడ్డికి నిరసన వ్యక్తమైంది. ప్రజల విశ్వాసం కోల్పోయినప్పుడు ఆత్మపరిశీలన చేసుకుని జరిగిన పొరపాట్లను చక్కదిద్దుకోవాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏవో తప్పులు చేస్తారు, తద్వారా రాజకీయ లబ్ధి పొందాలని ఎదురుచూస్తూ కూర్చోవడం వివేకవంతుల లక్షణం కాదు. పార్టీ యంత్రాంగానికి లేనిపోని ఆశలు కల్పించి వారిని ఆ భ్రమల్లోనే ఉంచాలనుకోవడం సహేతుకం కాదు. ప్రజా సమస్యలపై పోరాడి వాటి పరిష్కారం కోసం పాలకపక్షంపై ఒత్తిడి తీసుకురావాలి. తద్వారా ప్రజల మన్ననలు పొందాలి. ముందుగా తాను చేసిన తప్పులను, వైఫల్యాలను హుందాగా అంగీకరించాలి. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటూ జగన్ రెడ్డి భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటే కనీసం ప్రతిపక్ష నేతగా, పార్టీగా ప్రజలు గుర్తిస్తారు.